సంపుటి - 2   సంచిక - 14.

VOLUME   ISSUE.

ఆంధ్ర మహిళ

16. నృత్య వేదిక – నృత్య ప్రారంభము – శ్రీమతి. సామ్రాజ్యం.

NRUTYA VEDHIKA – NRUTYA PRARAMBHAM –

SMT. SAMRAJAYAM 35– 36.

ఆంధ్రమహిళ

సంపుటి 2 | 1 డిసంబరు 1945 | సంచిక 14

రాష్ట్ర మహిళాసభ కర్తవ్యము

ఆంధ్ర రాష్ట్ర మహిళాసభ సమావేశము నేడు రాజమహేంద్రవరమున విజయనగరం మహారాణీ శ్రీ విద్యావతీ దేవిగారి అధ్యక్షతను జరుగనైయున్నది. శ్రీ విద్యావతీదేవి ఎన్నికగన్న విదుషీమణి; సాంఘిక సమస్యలను విశాల దృష్టితో పర్యాలోకించి వాటి సత్వర పరిష్కారమునకు మార్గము చూపగల సంపన్నురాలు. ఆంధ్ర రాష్ట్ర మహిళాసభకు ఆమె నాయకత్వము వహించి రాష్ట్రములోని మహిళోద్యమమునకు చైతన్యము కలిగించగలరని మా విశ్వాసము.

ఆంధ్ర రాష్ట్ర మహిళాసభయొక్క మాతృసంస్థయగు అఖిలభారత మహిళాసభ సుమారు 30 సంవత్సరములనుండి స్త్రీలోకమునకు అద్వితీయమైన సేవ చేస్తూవుంది. హిందూ 'లా' సంస్కరణ విషయమున, గనులలోని స్త్రీ కార్మికుల పురోభివృద్ధి విషయమున, అనాధ శిశువులకు పాలు సరఫరాచేయు విషయమున అఖిల భారత మహిళాసభ చేసిన కృషియే ఆ సంస్థను మహిళాలోకమునకు మార్గదర్శకముగా చేసినది. ఇంతేగాక ఢిల్లీలోని లేడీ ఇర్విన్ కాలేజీ, బొంబాయి, బెంగాల్ రాష్ట్రములలోని శిశు సంరక్షణ కేంద్రాలు, దేశసే:కా శిక్షణ శిబిరాలు, ముఖ్యముగా బెంగాలులోని క్షామ నివారణ కేంద్రాలు, అఖిలభారత మహిళాసభయొక్క దీక్షను, ప్రజ్ఞను చాటుతున్నాయి.

అఖిలభారత మహిళాసభ కార్యక్రమ విజయానికి ముఖ్యముగా రెండుకారణములున్నాయని మనము గుర్తించాలి. మొదటిది-రాజకీయ విబేధాలకు తావివ్వని కార్యక్రమ ప్రణాళికను ఆ సంస్థ అనుసరించడమే. రెండవది మహాసభలు తీర్మానించిన విషయములను ఆచరణలో పెట్టుటకు అనుభవముగల "సెక్రెటేరియటు" ను నియోగించశమే. మహిళాసభ ఆశయము విద్యా సాంఘిక సమస్యా పరిష్కారమే కాబట్టి దాని కార్యక్రమములో రాజకీయ విబేధాలకు తావు లేదు. సేవానిరతిగల వ్యక్తులు సంఘంగా కృషిచేయడానికి నిర్దేశింపబడిన సంస్థలలో మహిళాసభయే ప్రాధాన్యము వహించినది. కాననే జమీందారులు-రైతులు, కాంగ్రెసు-

కమ్యూనిష్టులు, అందరూ మహిళాసభలో చేరి మహిళోద్యమమునకు సేవచేయుటకు పరిస్థితి కలిగింది. ఈ విషయమును అఖిలభారత మహిళా సభ గుర్తించినది కాబట్టి ఆ సంస్థ సజీవమై మహిళోద్యమమునకు ముఖ్యాంగముగానున్నది.

ఆంధ్ర మహిళామండలి దురదృష్టవశాత్తు మన రాష్ట్రములోని మహిళా సంఘాలు కొన్ని కాంగ్రెసుకు అనుబంధముగాను, మరికొన్ని కమ్యూనిస్టు పార్టీకి అనుబంధముగాను యేర్పడి రాజకీయ విభేధాలను పాటించుచున్నాయి. ఈ కారణముచేత ఆంధ్రరాష్ట్ర మహిళాసభ నిర్దేశింపబడిన కార్యక్రమమును కొనసాగించలేక నామమాత్రావశిష్టమైయున్నది. కొన్నిసంఘములకు మహిళాసభలో ప్రవేశములేక, ప్రవేశమువున్నవి కార్యక్రమము కొనసాగించలేక ఆంధ్ర రాష్ట్ర మహిళాసభ యెందునాపొందకుండా యున్నది. ఈ దుస్థితిని తొలగించి ఆంధ్ర రాష్ట్ర మహిళాసభ రాష్ట్రములోని మహిళాసంఘములన్నింటికిని యేకైక సంస్థగా వెలుగొంది మహిళా సేవ చేయగలదని ఆశిస్తున్నాము.

మహిళాసభ ఆశయము ముఖ్యముగా విద్యా సాంఘిక సమస్యా పరిష్కారమనే నిర్మాణ కార్యక్రమము. ఆశయములోనా అభిప్రాయ బేధాలకు తావులేదు; ఆచరణలోనా అధికార ప్రమేయములేదు. నిర్మాణ కార్యక్రమముయొక్క విశిష్టత ఈ రెండింటిపైననే ఆధారపడియున్నది. గుంటూరులో జరిగిన గతవార్షిక సమావేశము ప్రాతినిధ్య తగవులతో ప్రారంభమై, కార్యనిర్వాహకవర్గమునందు అధికారయుతమైన స్థానలకై పెనుగులాటతో అభాసయింది. ఇది ఆంధ్ర మహిళల అందరికిని అపవాదు. నేటి మహాసభకు అధ్యక్షత స్వీకరించిన శ్రీ విజయనగరం మహారాణిగారు ఆంధ్ర మహిళలకు చక్కని సలహాల నిచ్చి ఆంధ్ర రాష్ట్ర మహిళాసభకు జీవముపోసి, ఆంధ్ర మహిళోద్యమమును పునరుద్ధరించగలరని ఆంధ్ర మహిళలు వేచియున్నారు.

★

ఆంధ్ర జిల్లాలలో అనేక మహిళా సంఘాలూ, క్లబ్బులూ, విద్యాలయాలు స్త్రీల పురోభివృద్ధికి కృషిచేస్తున్నాయి. ఆ మహిళా సంఘాల కార్య నివేదికలను ప్రతినెలా 'ఆంధ్ర మహిళ'లో ప్రచురించుటకు యేర్పాటు చేసినాము. మహిళా సంఘాల కార్యదర్శినులు మాతో సహకరించి ప్రతినెలా వారి సంఘాలలో జరిపించిన కార్యక్రమం 'ఆంధ్ర మహిళ'కు సంక్షిప్తంగా తెలియపర్చ కోరుతాను. వివిధ సంఘాలకు ప్రత్యేకంగా యీ విషయముపై వ్రాయుట సాధ్యముకాదు కాన దీనినే మా ఆహ్వానముగా పరిగణించి మాకు తోడ్పడగలరని విశ్వసిస్తున్నాను.

అచ్యుతుని గిరిజ
సహాయ సంపాదకురాలు

"మహిళోద్యమం జాతికి వన్నె దిద్దుతుంది"

ఆంధ్ర రాష్ట్ర మహిళాసభాధ్యక్షులు

శ్రీ విద్యావతీ దేవిగారి వుపన్యాసం

ఆహ్వాన సంఘం వారు ఈ సమావేశానికి నన్ను అధ్యక్షురాలుగా ఎన్నుకొన్నందుకు వారికి నా కృతజ్ఞత. ఈ పదవిని ఇతఃపూర్వం అలంకరించిన వారు ప్రజాభ్యుదయానికి అనల్పమైన సేవ చేసినవారు. నేను అట్టి సేవను చేశానని చెప్పుకోలేను. అత్యంత మధురమైనదని పేరందిన తెలుగు భాషలో ప్రసంగించ లేని నా అశక్తతే నాకు మరింతగా ఖేదాన్ని ఆపాదిస్తున్నది.

ఈ సమావేశ సందర్భంలో మనతోవుండి, మన కార్య కలాపాలలో పాల్గొన లేక, స్వర్గ ధామమున కేగిన త్యాగమూర్తులను సంస్మరించడం మనకు విధివిహితం.

మనకు అనేక రీతుల తోడ్పడి, ప్రస్తుత సమావేశంలో పాల్గొన లేక పోయిన మన శ్రేయోభిలాషులకు, సహకారులకు అభినందనలు అంద జేయవలసిన బాధ్యతకూడా మనపై వున్నది.

ఈ పట్టణానికి రావడం నాకు అమిత ప్రమోదం ఒనగూర్చినది. రాజమహేంద్రవరం ఆంధ్రదేశ చరిత్రలో విశిష్టస్థానం ఆక్రమించుకొన్నది. రాజమహేంద్రవరం ఆంధ్ర రాజుల యశశ్చంద్రికలను దశ దిశాంతముల చాటినది. ఆంధ్ర రాజుల విశ్రుత కీర్తిని అత్యున్నత శిఖరాలకు గొనిపోయినది. ఇప్పటికీ రాజమహేంద్రవర వైభవాన్ని చాటే జానపదాలు, గేయాలు మనకు వినిపిస్తూనే వుంటాయి.

ఈ పూత గౌతమీ ప్రవంతీ కూలమున నిలిచినపుడు ఆదికవి వాల్మీకి దివ్యస్మృతులచే మన హృదయాలు నితాంత సంతోషతరంగితము లౌతూవుంటవి.

పవిత్ర గోదావరీ తీరస్థమైన ఈ పట్టణములోనే తొలుత నన్నయార్యుడు మహాభారతాంధ్రీకరణకు పూనుకొనినాడు.

మహోత్సాహ సంధాయకములైన ఈ చారిత్రక సంఘటనల విషయమలా వుండగా, రాజమహేంద్రవరం ఒకప్పుడు విజయనగర రాజ కుటుంబ రాజకీయ భవితవ్య నిర్ణయానికి తావలమయింది కూడా.

దీనివల్ల నాకు ఈ పట్టణంతో ఆంతరంగికమైన సాన్నిహిత్యము, తత్కారణంగా సంతోషమూ కలుగుతున్నవి.

రాజమహేంద్రవరం ఇప్పటికీ ఆంధ్ర విజ్ఞాన సంస్కృతి నిలయములన దగిన కేంద్రాలలో ఒకటై వుండడం నాకు ఎంతో ఆనందం కలిగిస్తున్నది. నేటికీ ప్రముఖ రాజకీయ నాయకులకేమి, సుప్రసిద్ధ సారస్వతాభిజ్ఞుల కేమి ఈ పట్టణం ఆవాసమై వుండడం విశేష మనక తీరదు.

ప్రస్తుత సమావేశానికి పూర్వం ఈ ప్రాంతంలో భయంకరమైన తుపాను రేగి, ప్రజలకు

మహిళలు సమానస్వాతంత్ర్యం సంపాదించిననాడే దేశానికి విముక్తి

అత్యధికమైన కష్టనష్టాలు సంభవించడం విచారకరం అలా నష్టపడిన వారికి మనం సానుభూతి నంద జేస్తున్నాము. తుపాను బాధితులైన ప్రజల కడగండ్లను ప్రభుత్వం గ్రహించి సాధ్యమైనంత సహాయం చేస్తుందని నేను సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. ఈ సందర్భంలో స్వచ్ఛందంగా సేవ చేస్తున్న సంస్థలకు కూడా తగు తోడ్పాటు లభించగలదని నేను ఆశిస్తున్నాను.

అనేక సమావేశాలు విభిన్న సమస్యలపై జరుగుతున్నవని కొన్ని వర్గాలవారు భావిస్తున్నారు. ఈ సమావేశాలలో ఉపన్యాసాల ప్రాగల్భ్యమే కాని, కార్యాచరణం శూన్యమే నన్న అనుమానం కూడా ఈ భావన మరుగున కొన్ని చోట్ల స్ఫురిస్తున్నది.

మొత్తంమీద ఈ విమర్శలు సహేతుకం కావని నేను చెప్పడం లేదు. మన మట్టుకు మనం ప్రసంగాలతోనే సరిపుచ్చక, ప్రసంగాలలో సూచించిన ప్రణాళికల సఫలతకు కృషి చేసి సాధించగల మనడానికి నాకు అవలేశం సందేహం లేదు.

మహిళా ఉద్యమం

కొంతకాలం క్రితంవరకూ స్త్రీకి స్వతంత్రంగా జీవించే అవకాశమే లేదనీ, స్త్రీల జీవితోద్దేశం పిల్లలను పెంచడం, సంసారం నిర్వహించడమేనని ఒక భావం పరివ్యాప్తమై వుంది.

అభిమానధనులైన మహిళలకు ఈ వైఖరి ఎనలేని వ్యథ కలిగించింది. ఇంగ్లండులోను, యూరోప్‌లోను ఇతరదేశాలలోను మహిళా ఉద్యమాలు వెలసినవి.

ఆస్తి పాస్తులను అనుభవించడంలో, రాజకీయ హక్కులలో, తదితర ప్రధానసమస్యలలో మహిళలు పురుషులతో పాటు తమకు సమాన స్వాతంత్ర్యం వుండాలన్నారు.

ఈ ఉద్యమ ఫలితంగా ఇంగ్లండులో అనేక చిక్కు సమస్యలు బయలు దేరినవి. మహిళలు కడకు దౌర్జన్యానికి కూడా పూనుకొనక తప్పినది కాదు. ప్రధానమంత్రి ఇంటి కిటికీలను బద్దలు కొట్టడం, ప్రజాసంస్థలున్న భవనాలపై ముట్టడులు జరపడం, పోలీసు వారిపై దెబ్బతీయడం మొదలైన చర్యలకు మహిళలు పాల్పడడం విధి విహిత మయింది.

అదృష్టవశాత్తు మన దేశంలో అటువంటి దౌర్జన్య కృత్యాలకు అవసరం లేక పోయింది. మన దేశంలో మహిళలలో చైతన్యోదయం ప్రశాంతగా జరిగింది. ఈ నాడు స్త్రీలు పాల్గొనని జాతీయోద్యమ శాఖ ఏదీ లేదు.

మన దేశంలో మహిళా మహోదయానికి వెలుగు దారులు చూపిన మహాత్మగాంధీ గారికి భారతీయనాయకులకు మనం కృతజ్ఞత చూపవలసి వున్నది.

అయితే తమ పౌరసత్వ స్వాతంత్ర్య సముపార్జనంలో స్త్రీలు అందుకోవలసిన అంతస్తు ఇంకా వున్నది. దీనికై అత్యంతమైన కృషి ఇంకా చేయవలసి వున్నది కూడా.

యుద్ధావసరం తీరాక సామ్రాజ్యవాదం హెచ్చింది

సాంఘికంగానేమి, చట్టరీత్యానేమి మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు కూడా తొలగి పోగలవని నేను విశ్వసిస్తున్నాను.

హిందూలాసవరణలు కూడా మహిళా లోకానికి తృప్తిని ఒనగూర్చగలవని నేను నమ్ముతున్నాను.

స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం కేవలం నిష్ప్రయోజకమేనని కొందరు చెప్పవచ్చు. స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యము సమానత్వము లభించడం వల్ల గృహసీమ స్వర్గసీమ కాబోదని, గృహారామ సీమలో విషవాహిని ప్రవహించునని తల పోసే వారు సంసార పోషణకు సాధనమైనది సంపద కాదని, మహిళల త్యాగ, ప్రేమలే అని విస్మరిస్తున్నారు.

మహిళలకు కూడా చట్టరీత్యా ఆస్తిలో భాగంవుండడం సమంజసం, ధర్మ సమ్మతమూను. దీనికి అవకాశం లభించడం వల్ల సాంసారిక సౌఖ్యం ఇనుమడిస్తుందే కాని తగ్గిపోదు.

ప్రస్తుత సమావేశంలో మనకు అత్యవసరమైన సమస్యలు చర్చించ బడగలవని నా నమ్మిక. మీ సమక్షాన ప్రతిపాదించ బడగల తీర్మానములను గురించిగాని, చర్చలను గురించిగాని నేను ముందుగా సూచించడం అప్రస్తుతమే కాగలదు. కనుక నేను మనకందరకూ సామాన్యంగా అవసరమైన సమస్యలనే కొంతవరకు పరిశీలించడానికి ప్రయత్నిస్తాను.

యుద్ధానంతర రాజకీయాలు

మన అదృష్టవశాత్తు యుద్ధం ముగిసింది. జర్మనీ, జపాను దేశాలు పాదాక్రాంతమయాయి. ఒకప్పుడు ఈ దేశాలు యుద్ధ దేవతనే ఆరాధిస్తూ రక్త ప్రవాహానికి వువ్విళ్లూరుతూవుండేవి. వారి జాతియే జీవకోటికి మణిపూస అని నమ్మి యితరులను కీటకప్రాయంగా చూస్తూ వుండేవి. నేడు వాటిగతి యేమైంది? మిత్ర రాజ్యాల ధాటికి ఆగలేక అపజయం పొందాయి; మిత్ర సైన్యాలు జర్మనీ జపాను దేశాలను ఆక్రమించాయి. ప్రపంచమంతటా అనేక వేలమంది ఫాసిస్టు దురాగతానికి యెదురు నిల్చి, ప్రజా యుద్ధంలో సర్వస్వమూ త్యాగం చేసారు కాబట్టే నేడు విజయం చేకూరింది. ఈ త్యాగం దేనికి? మిత్రరాజ్యాలకు విజయం చేకూరితే సంఘ జీవితంలో నూతనశకం ఆరంభమౌతుందనీ సామ్రాజ్య వాదుల దోపిడీ విధానం అంతమొంది ప్రజారాజ్యం ప్రాప్తిస్తుందనీ, ఆర్థిక దాస్యం మాయమగుటకు అవకాశం వుందనీ ఆశపడి లక్షలాది ప్రజలు యెంత త్యాగానికేనా వెనుదీయ లేదు. విజయానికి పూర్వమున్న ఆశాజ్యోతి నేడు సన్నగిలింది. యుద్ధ నిర్వహణలో వెల్లడించిన ఐక్యత విజయం చేకూరిన పిదప విచ్ఛిన్నమై నాశనం కాబోతోంది; సామ్రాజ్యతత్వంపునర్జీవించి పరస్పర ద్వేషాలు మిక్కుటమౌతున్నాయి. పాలస్తీనాలో అశాంతి ప్రారంభమయి, అగ్నిజ్వాలలు రేగు తున్నాయి. జావాలోనూ యిండోచైనాలోనూ జాతికి స్వా

ఎన్నికలలో కాంగ్రెసుకు విజయం నిశ్చయం

తంత్ర్యం కోరేయోధులపైనే బ్రిటీషువారు అగ్ని వర్షం కురిపిస్తున్నారు. ఐక్యత, సంఘీభావమూ యుద్ధావసరంలాగే కనిపిస్తున్నాయి. అవసరంతీరి విజయం చేకూరగానే సామ్రాజ్యాధికారం మీాద వుండే ఉబలాటం ప్రస్ఫుటించింది. యుద్ధకాలంలో వీరు చాటించిన వైరాగ్యం, స్మశాన వైరాగ్యంతీరయింది. నేటి శాంతిని పరస్పర ద్వేషాలు, అహంకారాలు భగ్నపరుస్తున్నాయి. మానవకోటినే మ్రింగివేయగల 'ఏటంబాంబు' మిత్రరాజ్యత్రయం యొక్క (అమెరికా, ఇంగ్లండు రష్యా) హక్కు భుక్తాలతో కూడిన స్వంత ఆస్తియై వుంటుందట. యుద్ధాత్పూర్వము అమలులో వుండిన వర్తకపు విషయిక మైన పోటీలూ, లాలోచీలు నేడు కూడా ప్రత్యక్షమై శాంతిని భగ్నము చేస్తున్నాయి. రూజువెల్టు అధ్యక్షుడు ఆనాడు నిర్వచించిన ప్రజాస్వాతంత్ర్య వేదాంతాలు వేదాంతంగానే వుండి పోయాయి. శాన్‌ఫ్రాన్సిస్కో సభలో చాటించిన ఆదర్శాలు అమలులో పెట్టటానికి యెట్టి కుతూహలము కనిపించటం లేదు. ప్రభుత్వాలు "power politics" రుచిమరిగి మానవాభ్యుదయానికి తోడ్పడడం లేదు. పరిస్థితులు యింత విషమంగా వున్నప్పుడు నేటి శాంతిని శాంతిగా యెట్లా భావించాలో మనకు తెలియదు.

జావాలో మరొక విషాదఘట్టము ప్రదర్శింపబడుతున్నది. జావానాయకుడగు డాక్టరు సోకర్నో యొక్క జాతీయోద్యమమును అణచుటకు మన దేశపు సైనికులను బ్రిటిషువారు ఉపయోగిస్తున్న విషయం మన దేశంలో ఎక్కువ అలజడి కలిగించింది. మనవలె బానిసత్వమును అనుభవించుచున్న జావా ప్రజలతో మనకు సహజముగా సానుభూతి వుంటుంది. వారి జాతీయోద్యమమును అణచి వారి స్వాతంత్ర్యా దర్శములను భగ్న పరచుటకు బ్రిటీషు ప్రభువులు మన సైనికులనే వుపయోగింప జూచుట లజ్జాకరమైన విషయము.

మనరాజకీయాలు - ఎలెక్షనులు

మన దేశపరిస్థితి యింతకన్నా అధ్వానంగా వుంది. రాజకీయ ప్రతిష్టంభన విముక్తి అయ్యే మార్గం గోచరంకావటం లేదు. వేవెల్ ప్రభువు యొక్క ప్రయత్నాలు విఫలమై దేశములో నిస్పృహ యెక్కువయింది. వేలకొలదీ ప్రాణాలను పొట్టను పెట్టుకున్న బెంగాల్ కరువు యింకా సింహస్వప్నంగానే యుంది. జీవయాత్ర సాగించడానికి ముఖ్యావసరమైన తిను బండారములు మొదలగు వస్తువుల ధరలు అమితంగా పెరిగి జీవితమే దుర్భరమనిపిస్తూ వుంది. ఈ పరిస్థితులు త్వరలో చక్కబడి దేశ సౌభాగ్యమునకు దారి కనిపించగలదని నేను ఆశిస్తున్నాను.

ఈలోగా ఎన్నికలు సంప్రాప్తమయ్యాయి. మన జాతీయ మహాసంస్థ యీ ఎన్నికలలో పాల్గొను చుండుట మనకు సంతోషకరమైన విషయము. రాష్ట్రీయశాసన సభలలోనూ, కేంద్రశాసన సభలోనూ కాంగ్రెసుకే జయము

పాకిస్థాన్ జిన్నాగారి వట్టి వెఱ్ఱితనం

కలుగుట నిస్సంశయము. కాంగ్రెసుతో మనకు యేవిధమైన అభిప్రాయ భేధాలున్నా, కాంగ్రెసే భారత జాతికంతకు ఏకైక సంస్థయని ఒప్పుకోవాలి. కాంగ్రెసు ఒక్క రాజకీయ పార్టీ మాత్రమే కాదు. భారతీయుల స్వాతంత్ర్యేచ్ఛ యీ సంస్థలో ప్రతిబింబించు చున్నది. కాననే భారత స్వాతంత్రమును అభిలషించే, జాతీయాభ్యుదయమునకు ఉవ్విళ్లూరే ప్రతీవారూ యీ యెన్నికల సంరంభములో కాంగ్రెసుకు తోడ్పడాలి. ఆంధ్ర మహిళ లందరూ యీ విషయములో తమ కర్తవ్యమును పాటించి కాంగ్రెసు విజయానికి తోడ్పడగలరని నా దృఢ విశ్వాసము.

బర్మాలో సామ్రాజ్య సేనల నెదిరించిన భారత జాతీయ సైనికులను నిందితులుగా పరిగణించి కోర్టు కీడ్చుట దురన్యాయమని దేశమంతా అలజడి చేస్తూవుంది. రాజప్రతినిధి యీ విషయమును సానుభూతితో పరిశీలించి జాతీయ సైనిక యోధులను విముక్తి చేయగలడని ఆశిస్తున్నాను.

ప్రస్తుతం మన జాతిని కలవరిస్తూ వున్న సమస్య 'పాకిస్థాన్' సమస్య. ఈ సమస్యా పరిష్కారంచేయటం రాజకీయ వేత్తలపని. కాని హిందూదేశ పౌరసత్వ హక్కును అనుభవించు చున్న నేను యీ పాకిస్థాన్ విషయమై నా అభిప్రాయం వెల్లడించుట ధర్మం.

జాతీయ ఐక్యతయే ప్రాధాన్యత వహించిన ఈ రోజులలో 'పాకిస్థాన్' కొరకై కొందరు ఉబలాటపడుట మన దురదృష్టం. జిన్నా సాహేబ్ యెంత ఘోషించినా హిందువులూ, మహమ్మదీయులు వివిధ జాతులకు సంబంధించిన వారని నమ్ముట దుస్సాధ్యము. అనేక తరములనుండి హిందువులు, మహమ్మదీయులు కలివిడితో, సామరస్యముతో సంఘ జీవితం సాగిస్తున్నారు. ఈ దీర్ఘమైత్రియే వైజ్ఞానికంగా కవిత్వం, చిత్రలేఖనం, సంగీతం మొదలగు వాటిలో సమైక్యతకు తోడ్పడింది. మన జాతి యొక్క విజ్ఞాన వికాసాలు హిందూ మహ్మదీయ సంఘ జీవనము యొక్క ప్రతిఫలమే. ఉత్తర హిందూస్థాన పరిస్థితులతో నాకు చాలా పరిచయం వుంది. ఈ రోజునకూడా వేలకొలది గ్రామములలో హిందువులూ మహమ్మదీయులు యేక గర్భజనితులవలె జీవితం సాగిస్తున్నారు. జిన్నాసాహేబుగారి హిందూదేశ ఖండన వేదాంతం వారికి అయోమయమైన విషయం. రాజకీయంగాను, ఆర్థికంగాను వారి జీవితం ఒకే పక్కీని నడుస్తోంది. హిందువులకైనా, మహ్మదీయులకైనా కావలసినది కడుపు నిండే భోజనం, విశ్రాంతి నిచ్చే యిల్లూ వాకిలీ, వీటికి తోడ్పడే ఉద్యోగం, అప్పు యిచ్చే షాహుకారు పిడికిటినుండి విముక్తి, చదువు సంధ్యా, విశ్రాంతికి సదుపాయం— యివే యెవరికి కావలసినాను. ఇన్ని సమస్యలుండగా మతభేధాలపై దృష్టిని త్రిప్పజూచుట అక్రమం.

భాషాప్రయుక్త రాష్ట్రాలు కలిగిన మన దేశానికి ఫెడరల్ రాజ్యాంగ విధానమే అనువుగా వుంటుంది. ఆ విధానంలో ప్రతీ రాష్ట్రమునకు

ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము ఆంధ్రుల జాతీయ వాంఛ

స్థానిక వ్యవహారములను పరిష్కరించు కొనుటకు స్వేచ్ఛవుంటుంది. ప్రత్యేకముగా రాష్ట్రములకు సంబంధించ నట్టియు, వివిధ రాష్ట్రముల పొందికకు ముఖ్యముగా కావలసి నట్టియు, దేశరక్షణ, విదేశాంగ వ్యవహారములు, కర్రెన్సీ వంటి విషయములను పరిష్కరించుటకే కేంద్రప్రభుత్వమున కధికారముండును. కావలిస్తే కేంద్రప్రభుత్వమునకు రాజ్యాంగ ప్రణాళికలో నిర్ణయింపబడని విషయముల పై అధికారము రాష్ట్రీయ ప్రభుత్వములకే దాఖలు చేయవచ్చును. ముస్లిమ్ లీగు సహృదయముతో పరిస్థితులను పర్యాలోకించి దేశైక్యతకు తోడ్పడగలదని నా విశ్వాసము. వారి నేటి పాకిస్థాన్ సూచన చరిత్రకే భిన్నమై వుంది. భారతీయుల ముఖ్యాదర్శం జాతికంతటికి స్వాతంత్ర్యము సంపాదించుటయే. అట్టితరి అర్థంలేని పాకిస్థాన్ గొడవను లేవదీసి జాతీయ వాంఛకు అడ్డుతగులుట మన దౌర్భాగ్యం. త్వరలో వారుగూడా స్వాతంత్ర్య సంపాదనకై మనతో ఏకీభవించి, కృషిచేస్తారని ఆశిస్తున్నాను.

ఆంధ్ర రాష్ట్రం

అటువంటి రాజ్యాంగ సమాఖ్య ప్రస్తుతంలో రాష్ట్రాలు ఏర్పడివున్న విధానాన్ని అనుసరించిగాక భాషాప్రయుక్త విధానాన్నే అనుసరించి వుండవచ్చు.

భారతదేశాన్ని భాషాప్రయుక్తంగా విభజించవలసినదన్న కోరిక ఈ నాటిది కాదు. నిజానికి కొన్ని సందర్భాలలో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు పరిచిందికూడా. భారత కాంగ్రెస్ కూడా ఈ సూత్రాన్ని ఆమోదించింది. కాంగ్రెస్ అధికారంలో జరిగిన రాష్ట్ర నిర్మాణం భాషాప్రయుక్త సూత్రాన్ని అనుసరించే సాగింది.

1911 నుంచీ ఆర్థిక, వైజ్ఞానిక పునర్జీవనకు తమంత తాము కృషిచేయ గలగడానికై ప్రత్యేక రాష్ట్రం ఈయవలసిందని ఆంధ్రులలో ఒక కోరిక అతి బలీయంగా పెంపొందుతూ వచ్చింది. మదరాసు వంటి సువిస్తృత రాష్ట్రంలో తమ పురోవృద్ధికి ఆకరములైన ప్రణాళికల సమలుపరచదగు అవకాశాలు ఆంధ్రులకు ఏదో ఒక కారణం పెంపున లభించకున్నవి.

త్వరలో ఏర్పడగల కొత్త శాసన సభలు ఈ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సమస్యను పరిష్కరించి ఆంధ్రుల చిరమనోరథ సాఫల్యానికి దోహదమీయగలవని నేను ఆశిస్తున్నాను.

తుదిపలుకు

నా ప్రసంగం సందర్భంలో మన జాతీయ జీవనానికి సంబంధించిన కొన్ని ప్రధాన సమస్యలను చర్చించ సాహసించినాను. ప్రస్తుత సమావేశంలోని చర్చనీయాంశాలను ఇదమిత్థమని నేను ఉద్దో పూర్వకంగా సూచించక, పరిస్థితిని మొత్తంమీదనే సమీక్షించినాను. వేర్వేరు తీర్మానాలను ప్రతిపాదించనున్న ప్రతినిధులుతమ విజ్ఞానానుభవాలను ఈ సమావేశ నిర్వహణకై వినియోగిస్తారని నమ్ముతున్నాను.

ఆహ్వాన సంఘంవారు నాకు చేసిన గౌరవానికి వారికి నా కృతజ్ఞతను మరొకసారి తెలుపుకుంటున్నాను. ”

★



రాష్ట్రీయ మహిళాసభ సమావేశము కానున్న యీ శుభ సమయమున "గ్రాండ్ ఓల్డ్ ఉమన్" దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మగారికి కృతజ్ఞతాంజలి సమర్పించుట మనవిధి. ఆంధ్ర మహిళా లోకం గాఢ సుషుప్తి చెందియున్న కాలములో దేశబాంధవి స్వాతంత్ర్య పతాకమును ప్రతిష్టించి మహిళోద్యమ సుస్థాపనకు కారకురాలయింది. వయస్సు మీరినా, ఆరోగ్యం చెడినా, ఆమె స్థైర్య సాహసాలు సన్నగిలలేదు. దేశమాత పిలుపు వినబడితే చాలు జాతీయ సైన్య ప్రథమ శ్రేణిలో ప్రత్యక్షం. దేశబాంధవి పోలీసులకు సింహస్వప్నం, జైలు సూపర్నెంట్లకు హడలు; ఆమె వేదిక నధిష్టించి శ్లోకం విసిరితే చాలు ప్రజానీకం యొక్క జేజేలు అందుకుంటుంది. ఆమె ఆయురారోగ్యాలు ఆంధ్ర మహిళల సౌభాగ్యం.

మహిళా మహాసభ - ఐక్యత

నేడు ఆంధ్రరాష్ట్ర మహిళా సభ రాజమండ్రీలో సమావేశము కానున్నది. మహిళోద్యమములో ఐక్యతను చేకూర్చి మహిళాసభ ఆశయమగు నిర్మాణకార్యక్రమమునకు సేవాభిలాషులగు ఆంధ్రమహిళల నందరినీ ఒక సంస్థగా చేర్చి జాతీయ జీవనమునకు తోడ్పడగల అవకాశము నేడు అధ్యక్షురాలు విజయనగరం మహారాణీ గారికినీ, కార్యకర్తలు శ్రీమతి కొండా పార్వతీదేవి, సి. హెచ్. చంద్రమతీ ప్రభృతులకును మంచి అవకాశము లభించినది. ఈ మహాసభ కార్యక్రమము నొకదానిని యేర్పరచి అమలులో పెట్టుటకుముందు మహాసభకు వున్న కొన్ని చిక్కులను కార్యకర్తలు పరిశీలించాలి. ఆ పరిశీలనకు తోడ్పడుటకై యీ మధ్య ఒక జిల్లా మహిళా సంఘ కార్యదర్శికిని, మదరాసులోని ఆంధ్రమహిళా సభ కార్యదర్శికిని జరిగిన ఉత్తర ప్రత్యుత్తరములలోని కొన్ని భాగములను ప్రచురించుచున్నాము. ఇందు తెలుపబడిన విషయములపై సహృదయులగు ఆంధ్రమహిళలు తమ అభిప్రాయములను తెలుప వలసినదిగా విన్నవించుచున్నాము. సం॥

జిల్లా మహిళా సంఘ కార్యదర్శిని లేఖలోని భాగము:- "రాష్ట్రములోని అన్నిరకాలైన మహిళా సంఘాలు ఐక్యతతో కలిసి పని చేయుట చాలా అవసరమని ఆంధ్ర మహిళలో మీరు వ్రాసిన సంపాదకీయాన్ని మేము హృదయ పూర్వకంగా బలపరుచుచున్నాము. వివిధ రాజకీయాభిప్రాయాలు కలిగియున్నప్పటికి ప్రజాస్వామిక సూత్రము ప్రకారము అధిక సంఖ్యాకులైన ప్రతినిధులు నిర్ణయించినటువంటి రాజకీయ పాలసీనే మహిళా సంఘము అనుసరింప వచ్చును. వ్యక్తిగతముగా యెవరి రాజకీయాభిప్రాయములను వారు కలిగియుండవచ్చును. మహిళాసంఘ వేదిక మీద పార్టీ రాజకీయ ప్రచారము చేయుటకు యెవ్వరును అభిలషించ కూడదు.........గుంటూరులో జరిగిన రాష్ట్రసభకు మేమందరము వెళ్లినాము. కమ్యూనిస్టు యువతులు నడుపుచున్న ఉద్యమాన్ని వెలివేయాలనే ధోరణిని సభా కార్యకర్తలు అనుసరించి గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లా మహిళా సంఘాలను అనుబంధ సంఘాలుగా అంగీకరించ లేదు. ఈ పరిస్థితే రాజమండ్రిలో జరుగబోవు రాష్ట్ర మహిళా సభకు గూడ సంభవించకుండా వుండుటకు మీరు ప్రయత్నించాలి. ఈ విషయములో మాకు మీరిచ్చే సూచనలు యేమైన వుంటే దయ చేసి తెలియబరచండి."

పై లేఖకు మదరాసులోని ఆంధ్రమహిళా సభ కార్యదర్శిని దుర్గాబాయి ప్రత్యుత్తరములోని భాగములు :—

రాజకీయంగా భిన్నాభిప్రాయాలు గలవారికి రాష్ట్ర మహిళా సభలో ప్రవేశం కలుగుట లేదని విన్నాను. అట్టి అవసరం ఎందుకు కలిగిందో నాకు తెలియదు.

నిర్మాణ కార్యక్రమం కొనసాగించుతూ మహిళలను ప్రజాసేవకు తర్ఫీదు చేయడానికే అఖిల భారత మహిళా సభ, దానికి అనుబంధంగా ఆంధ్ర రాష్ట్రమహిళా సభ యేర్పడ్డాయని నా వుద్దేశం. రాజకీయ విషయాలలో సంబంధం కల్పించుకుని సేవచేయడానికి కాంగ్రెస్, జస్టిస్ పార్టీ, కమూనిస్టు పార్టీ మొదలగు సంస్థలు వుండనే వున్నాయి. వాటికి తోడు రాష్ట్రమహిళా సభ గూడా యెందుకు? వివిధ రాజకీయాభిప్రాయాలుగల వ్యక్తులు (సంస్థలుగాదు) సర్వజన సమ్మతమైన నిర్మాణ కార్యక్రమం సంఘురీత్యా కొనసాగించడానికి పాటుపడేది రాష్ట్రమహిళా సభ అయివుండాలి. మీరు యీ వుద్దేశంతో యేకీభవిస్తారని అనుకుంటా.

రాష్ట్రమహిళాసభ ఒక రాజకీయ పంథాను తొక్కాలి అని మీ వుద్దేశం అయివుండవచ్చును. దానికి నేను అంగీకరించను. మీరు కాంగ్రెసు సభ్యురాలైతే రాజకీయంగా కాంగ్రెసు సంఘంలో పనిచేస్తారు; కమ్యూనిస్టు అయితే కమ్యూనిస్టుపార్టీతో ముడి పెట్టుకుంటారు. ఆ కాంగ్రెసు, కమ్యూనిస్టు రాజకీయ ధోరణులకు రాష్ట్రీయమహిళా సభలో కూడా అవకాశం ఎందుకు వుండాలి? ఫక్త నిర్మాణ కార్యక్రమానికే వుద్దేశింపబడిన స్త్రీ సంఘాలలో కూడా యీ రాజకీయ 'హిస్టీరియా' ప్రవేశించడం వలననే కొన్ని స్త్రీ సంఘాలు 'మహిళా కాంగ్రెసు' గాను మరికొన్ని ఎఱ్ఱ జండా స్త్రీ సంఘాలుగానూ తయారై కొట్లాడుకుంటున్నాయి. పర్యవసానం? శూన్యం. "వివిధ రాజకీయాభిప్రాయాలు కల్గివున్నప్పటికి ప్రజా స్వామిక సూత్రం ప్రకారం అధిక సంఖ్యాకులైన ప్రతినిధులు నిర్ణయించి నటువంటి రాజకీయ పాలసీనే మహిళా సంఘం అనుసరింపవచ్చును" అని మీరు వ్రాసారు. తిరిగి "మహిళాసంఘం వేదికమీద పార్టీ రాజకీయాలు ప్రచారం చేయడం ఎవరూ అభిలషింప కూడదు" అన్నారు. ఈ రెండూకలిపి చదువుతే నాకు అర్థంకాలేదు. రాష్ట్రమహిళా సంఘం ఒక రాజకీయ పాలసీని అనుసరించాలని కొంత మంది కుతూహల పడుతున్నారు కాబట్టే రాష్ట్రమహిళా సభ ఎందును పొందకుండావుంది. ఆ సభను కమ్యునిస్టు పార్టీకి అనుబంధంగా చేద్దామని మీరు ఆశించబట్టే మీకు సభలో స్థానం లేకుండా చేయాలన్న పట్టుదల హెచ్చింది. ఆ సభను 'మహిళా కాంగ్రెస్' గా బలపరుద్దామన్న కుతూహలం కొంతమందికి వుంది కాబట్టే అట్టివారిని ఓట్ల బలంతో వెళ్ల గొట్టాలన్న పట్టుదల హెచ్చింది. రెండూ తప్పనే నా అభిప్రాయం.

అయితే, రాష్ట్రమహిళా సభకు రాజకీయ ప్రసక్తి అవసరం లేనేలేదంటారా అని మీరు అడగవచ్చు. రాజకీయంగా అందరికీ సమ్మతమైన ఒక్క తీర్మానం చేస్తే చాలు. మచ్చుకు:—"హిందూదేశానికి స్వాతంత్ర్యం కావాలి. పరప్రభుత్వాన్ని వెళ్లగొట్టి ఈ స్వాతంత్ర్యం సంపాదించడానికి స్త్రీలు అనేకులు త్యాగం చేస్తున్నారు. వారందరికీ యీ మహాసభ జోహారులిస్తోంది" అన్నది. అంతేగాని వైషమ్యాలతో కూడుకున్న రాజకీయ తీర్మానాలు చేయడానికి రాష్ట్రమహిళ సభలో అవకాశం లేదనీ, ఆ సభకు అధికారం లేదనీ నా అభిప్రాయం.

రాష్ట్రమహిళా సభను రాజకీయ కక్షలకు దూరంగా వుంచే యేర్పాట్లు చేయగలిగితే—Milk problem, Adult Education, child welfare, Home Industries మొదలగుగాగల కార్యక్రమం రాష్ట్రం మొత్తాన్ని రాష్ట్రమహిళా సభ ద్వారా చేయడానికి మంచి పరిస్థితి యేర్పడుతుంది. లేదా, ప్రతీవార్షిక సమావేశంలోనూ యీ తగవులు తప్పవు.

గుంటూరు, కృష్ణా మొదలగు జిల్లా సంఘాల నిబంధనలు నాకు తెలియవు. అవి కమ్యూనిస్టు పార్టీకిగాని కాంగ్రెసు సంఘానికిగాని, మరియే యితర రాజకీయ సంస్థకుగాని అనుబంధంగా యేర్పడి వుంటే రాష్ట్రమహిళా సభ వాటికి ప్రాతినిధ్యం యివ్వక పోవడం సమంజసంగానే వుంది.

ఈ సందర్భంలో మద్రాసులో వుండే ఆంధ్రమహిళా సభను గురించి కొంచెం వ్రాస్తాను. ఈ సభలో కాంగ్రెసు సభ్యులు, జస్టిస్‌పార్టీ సభ్యులు, కమ్యునిస్టు పార్టీ సభ్యులు ఏ పార్టీకి చెందని సభ్యులు—వారంతా వున్నారు. మేమంతా కలసి చేయగలిగిన నిర్మాణ కార్యక్రమం కొనసాగిస్తున్నాము. మహిళా సంఘం యిల్లాగే వుండాలనీ, యీ విధంగానే పనిచేయ్యాలనీ మా అందరి వుద్దేశము. దీనినే ఐక్యత అని అంటే ఆ ఐక్యతను మా ఆంధ్రమహిళా సభ పొందింది. నేను చేయగలిగిన కాంగ్రెసు కార్యక్రమం యేదైనా వుంటే స్థానిక కాంగ్రెసు సంఘం ద్వారా చేస్తాను కాని ఆంధ్రమహిళా సభకు ముడి పెట్టను; అట్లే మా సభలో వున్న జస్టిస్ పార్టీ సభ్యులు గూడాను. ఈ విధానం సరియైనదని అనుభవంవలన రూఢి అయినది. మా సభ కార్యక్రమం Adult Education classes నడపటం, నూలు తీయడం, హరిజనవాడలకు సభ్యురాండ్రు regular గా వెళ్లి చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పడం మొదలైనవి. కూలి జనం నివసించే ఒక పేటలో ఒక ఆసుపత్రి, పాఠశాల నెలకొల్పడానికి గూడా ప్రయత్నం చేస్తున్నాము.

ఈ కార్యక్రమంలో సభ్యురాండ్రంతా ఉత్సాహంతో పాల్గొంటున్నారు. సభ్యురాండ్ర మధ్య ఏ విధమైన అసూయలుగాని మీ దయవల్ల యింకా వుదయించ లేదు. ఆ దౌర్భాగ్యం మా సభకి ఎన్నటికీ పట్టదని ఆశిస్తున్నాము. ఎందుచేత ? మా సభ నేడు ఒక కార్యక్రమం జయప్రదంగా సాగించిందంటే ఆ గౌరవం మా సభకే దక్కుతోంది; రాజకీయంగా నేను సభ్యురాలుగావున్న కాంగ్రెసు సంఘానికి గాని, మరొకరు సభ్యురాలుగా వున్న కమ్యూనిస్టు పార్టీకి గాని దక్కనీయటం లేదు. మా సభ సమిష్టిగా చేసే కార్యక్రమం మా సభదే; వ్యక్తులు చెందిన రాజకీయ సంస్థలది కాదు. party purposes కోసము సభను exploit చేసే దురుద్దేశం మా సభ్యురాండ్రలో ఎవరికీ లేక పోవడం చేత సంఘాభివృద్ధికి మా శక్త్యాను సారం కృషి చేయగలుగు తున్నాం. పార్టీ ప్రాబల్యాన్ని దృష్టిలో వుంచుకుని కార్యక్రమం యేర్పరచుకొని వుంటే మా ఆంధ్ర మహిళా సభ కూడా నామమాత్రావశిష్టమై యుండేది; లేక ఆంధ్ర మహిళా సభలోనే కమ్యూనిస్టు గ్రూప్ అనీ, కాంగ్రెస్ గ్రూప్ అనీ, జస్టిస్ గ్రూప్ అనీ బయలుదేరి కార్యక్రమం శూన్యమై సంస్థశిథిలమై వుండేది. మహిళా సంఘాల నిర్మాణం ఎల్లావుండాలో విశదీకరించడానికి ఆంధ్ర మహిళాసభ కార్యక్రమం గురించి చెప్పాను కాని వేరుకాదు.

మీరు నే నిచ్చే సూచనలు ఏమైనా వుంటే వ్రాయమన్నారు. అయితే వినండి.

మీ జిల్లా సంఘం కాంగ్రెసుకుగాని, కమ్యూనిస్టుపార్టీకి గాని అనుబంధంగావుండి, ఆ రాజకీయ సంస్థల తాకీదులను

(కొదవ ప్రక్క పేజీలో)

అమలులో పెట్టడానికే మీ సంఘాలు యేర్పడితే, ఆంధ్ర రాష్ట్రమహిళా సభలో మీకు స్థానం లేదు. దానితో సంబంధం పెట్టుకోవాలన్న కుతూహలం వుంటే రాష్ట్రమహిళా సభ విచ్ఛిన్నానికి మీరే బాధ్యులౌతారు.

మీ జిల్లా సంఘానికి ఏ రాజకీయ కక్షతోనూ ప్రసక్తి లేకపోతే రాష్ట్రమహిళా సభలో ప్రాతినిధ్యం మీకు వుండి తీరాలి. మీకు అట్టి సంబంధం లేదని రుజువుచేసి అధ్యక్షురాలు విజయనగరం మహారాణీగారికి నచ్చచెప్పండి. సంఘరీత్యా యేరాజకీయ కక్షతోనూ సంబంధం లేదని నిశ్చయమైతే ఆమె మీకు ప్రాతినిధ్యం యిస్తారు.

ఆ రుజువు చేసుకోగలిగే సామర్థ్యం మీకు, విషయములను పరిశీలించి ఇదమిద్ధమని నిర్ణయించే పరిస్థితి అధ్యక్షురాలికీ మహాసభ జరిగే ఒకటి రెండు దినాలలో చిక్కక పోవచ్చును. మీకు ప్రాతినిధ్యం ప్రాప్తించక పోవచ్చును. మీ సంఘం ఫక్తు మహిళా సంఘమే అయితే (అంటే, ఏ రాజకీయ కక్షకూ లోబడని సంఘము) మీకు వచ్చిన లోటేముంది? సర్వజనాంగీకారమైన మహిళోద్యమ కార్యక్రమం నెరవేర్చడమే మీ సంఘ లక్ష్యమయితే, మీకు ప్రాతినిధ్యం యివ్వని కారణాన్న ఆంధ్ర రాష్ట్రమహిళా సభే లోటును అనుభవిస్తుంది. మహాసభలో ప్రాతినిధ్యం దొరకనప్పుడు మీ కర్తవ్యం యేమిటి? నినాదాలు లేవదీసి సభలో గల్లంతు చేయడమా? మీ సంఘం ఒక ప్రత్యేక రాజకీయ కక్షకు చెందినదైతే యిదే అనుసరణ—పార్టీ ప్రాబల్యం గొంతుక శక్తిమీదే ఆధారపడి వుంటుంది కనక. లేదా, నిర్మాణ కార్యక్రమం మీదే మీ దృష్టి వుంటే ప్రాతినిధ్యం కోసం ప్రాకులాడి అది చిక్కక పోతే రెంగ పెట్టుకోరు. నిర్మాణ కార్యక్రమంలో అభిప్రాయభేధాలకు తావు లేదు. అంటే, నిర్మాణ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టడానికే యేర్పడిన ఆంధ్ర రాష్ట్రమహిళా సభ సమావేశంలో పట్లు ప్రసక్తి వుండనే వుండదు. అట్టి సమావేశంలో మీ జిల్లా సంఘానికి ఓటు లేక పోతే వచ్చిన మహా ఆపద యేమిటి? మిగతా జిల్లా సంఘాలతో కలిసి పనిచేసే భాగ్యం మీకు వుండదు. నిజమే కాని మీ కార్యక్రమమే నిర్దుష్టమైతే ఆంధ్రమహిళా లోకం మీ జిల్లా సంఘానికే అనుబంధం అవుతుంది.

గుంటూరులో జరిగిన మహాసభ తరువాత నేటి వరకు రాష్ట్రమహిళా సభ కార్యనిర్వాహక వర్గసమావేశము ఒకసారి కూడా కాలేదు. ఈ పరిస్థితే ప్రతీ సంవత్సరమూ సంభవిస్తోంది. అనగా ఆంధ్ర రాష్ట్రమహిళా సభ సంవత్సరమున కొకసారి జరిగే పేరంటంలాగ రూపొందింది. మహాసభల మధ్యకాలంలో కార్య నిర్వాహకవర్గ సమావేశాలు జరిగితే ఒక కార్యక్రమం యేర్పరచుకోవడం, దానిని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించడం సంభవిస్తుంది. అదీ కాక, రాష్ట్రమహిళా సభకు ఏ యే సంఘాలు, సంస్థలు అనుబంధంగా వున్నాయో, ప్రాతినిధ్యం వహించడానికి యే సంఘాలకు హక్కువుందో తేలుతుంది. ప్రతీ గ్రామంలోను ఆంధ్ర రాష్ట్రమహిళా సభకు అను బంధంగా సంఘాలను, సంస్థలను నెలకొల్పి మహిళోద్యమాన్ని పునరుద్ధరించడానికి అవకాశం యేర్పడుతుంది. ఈ బాధ్యతను మన అధ్యక్షురాలు విజయనగరం మహారాణివారు వహించి ఆంధ్ర రాష్ట్రమహిళా సభకు చైతన్యం ప్రసాదిస్తారని ఆంధ్రమహిళలు ఆశింపవచ్చును.



దాంపత్యం - తద్వైఫల్య కారణాలు

మూలం:
శ్రీమతి లలితకుమరప్ప, బి.ఎస్.సి.

అనువాదం:
శ్రీమతి కే. వీరలక్ష్మి

[సతీపతుల దాంపత్యం సుఖాస్పదమై వుండకుండా అనేక సంసారాలు విచ్ఛిన్నంకావడం మనం నేడు గమనిస్తున్నాం. శ్రీమతి లలిత కుమరప్పగారి అభిప్రాయాలలో కొన్ని యోచనకు ఎడమిస్తున్నప్పటికీ వాటిలో కొంత వరకు సత్యం లేక పోలేదు. సం.]

వివాహం అనేది స్త్రీ పురుషులకు ఇరువురకూ అత్యంత ప్రధానమైన జీవిత సమస్య అని అందరకూ తెలుసు. దాంపత్య జీవితం విజయవంతంగా సాగాలంటే స్త్రీలైనా, పురుషులైనా, ముందు అంటే, వివాహాత్పూర్వం ఎక్కువ యోచన చెయ్యాలి. కొంతమంది పెళ్లి జీవితంలో ఒక పెద్ద జూదంవంటిది అంటారు. దాంపత్యజీవిత మార్గం సుకరంగా, సుగమంగా, నిష్కంటకంగా వుండడం విశేషంగా మన ప్రయత్నాలపైనే, కృషిపైనే ఆధారపడి వుంటుంది. అది స్త్రీ పురుషులు ఉభయులు తమ విభిన్న ప్రకృతులను సమాధాన పూర్వకమైన వైఖరితో—సామరస్య సమన్వితం చేసుకోవడం పైనే ఎక్కువగా ఆధారపడివుంటుందికూడా.

ఇరువురి స్వభావాలూ ఒకరి కొకరికి ఏ విధంగాను సరిపడక, కలిసి మెలిసి వుండటమనేది దుస్తరమైనపుడే విడాకులకు పూనుకోవాలి. ఇద్దరకీ ఏ విధంగాను సమాధానం కుదరదు అని తోచినపుడే విడాకులు అవసరమౌతుంది. ఇక వారు విడి పోయిన పిమ్మట మళ్లీ పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల గాని, లేక విడిగా ఏ సామాజిక సేవో, దేశసేవో, చేస్తూనో గాని శేష జీవితాన్ని గడపటంలో సంతృప్తి,శాంతి పొందవచ్చు.

ఒకరి నుంచి ఒకరు విడిపోదలచుకొన్న వారిని సమర్థించడం కాదు నా లక్ష్యం. వివాహం చేసుకొన్న పిదప— ఒకసారి దాంపత్య పాశబద్ధులైన పిదప, ఆ వైవాహిక జీవితాలను ఏ విధంగా పోరు లేకుండా గడపగలరో యోచించడమే నా ప్రధానోద్దేశం.

పెళ్లి చేసుకున్న తర్వాత భార్య భర్త ఒక విషయంపై ఏకీభవించక పోవడం, కలహించడం, ఇంతమంది పురుషులు ప్రపంచంలో వుంటే ఈయన్నే ఎందుకు పెళ్లాడాలా అని స్త్రీ, ఈ విశాల విశ్వంలో ఈమేగాని నాకు భార్యగా వుండడానికి మరోరమణీమణి లభ్యం కాకపోవడం కర్మం గాక మరేమని భర్త దురపిల్లడం మనం చూస్తునే వున్నాం.

ఇలా విరక్తి పొంది, ఆందోళన పడేవారిలో నూరింటి 90 మంది తమ విభేదాలకు కారణం తెలుసుకొని, వాటిని సర్దుబాటు చేసుకోడానికి గాని సమష్టిగా కృషి చేస్తే, ఉభయుల మధ్య సమాధానం కుదరడానికిగాని అనేకావకాశాలు వున్నాయి.

స్త్రీ పురుషులు తమ వైవాహిక జీవితాన్ని సుఖంగా గడపాలంటే ఇరువురి మధ్య సానుభూతి భావం, సామరస్యం, ఒకరి పట్ల ఒకరు నిష్కపటంగా వర్తించడం, పరస్పర విశ్వాసం అవసరమని శ్రీమతి కృష్ణహఠీసింగ్ తెలుపుతున్నది.

దాంపత్య జీవితాలు భగ్నం కావడానికి ఇవే కాదు. ఇంకా అనేక కారణాలున్నాయి.

నాగరికత, శాస్త్ర పరిజ్ఞానం హెచ్చిన కొలదీ మన జీవితాలు జటిలమైనాయి.

ఇదివరలో మన పూర్వులు తమ జీవితాలను అతి సంతృప్తిగా గడపుకొనే వారు. అవిభాజ్యంగా సమష్టిగా కుటుంబాలను నిర్వహించుకొనేవారు. నాగరికత హెచ్చిన కొలదీ మన జీవితాలు సమస్యలవలె జటిలమౌతున్నాయి.

ఘటన?

కుటుంబాలు విడి పోతున్నాయి. సమాజంలో స్వేచ్ఛ హెచ్చి, స్త్రీ పురుషులు విచ్చల విడిగా మసలడానికి అవకాశం ఏర్పడుతున్నది. ఈ విధాన విచ్చలవిడిగా విహరిం

చడంవల్ల కొన్ని సందర్భాలలో నిరపాయకరంగా ప్రారంభమైన మైత్రి అది నీతికరమైన సంబంధంగానో, లేదా వివాహం జరిగి, చివరకు విడాకులు పుచ్చుకోవడంతోనో సమాప్తం కావడం జరుగుతూ వస్తున్నది.

విడాకులవల్ల కాపరం విచ్ఛిన్నంకావడం యువతులకేమి, వారి తలిదండ్రులకేమి అంత అభిలషణీయం కాదనే చెప్పాలి.

స్త్రీలు నేడు పొందుతున్నంత స్వేచ్ఛ లేకుండా ఇదివరలో తమ ఇల్లే కాణాచిగా మెలగినప్పుడు వారికి అసౌఖ్యం వుండేదా అని నేను ప్రశ్నిస్తాను.

అయితే నాగరికత విపరీతమైన, అధునాతనమైన పరిణామం పొందిన ప్రస్తుత కాలంలో స్త్రీలకు సమధికంగా స్వేచ్ఛ లభించింది. ఉన్నత విద్య నభ్యసించడానికి, స్వతంత్రంగా మసలడానికి అవకాశం కలిగింది. ఈ నాడు స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్నారు. విమానాలు నడుపుతున్నారు. గనులలో ప్యాక్టరీలలో పనులు చేస్తున్నారు. ఈ విధంగా ఒకప్పుడు ఒకే కూటమిగా వుండే కుటుంబం రానురాను విడి పోతూవచ్చింది. ఇది కేవలం పాశ్చాత్య దేశాల్లోనే కాదు, ప్రాచ్య దేశాల్లోకూడా సంభవిస్తున్నది.

సమాజంలో స్త్రీలు అనేక మంది పురుషులను, పురుషులు అనేకమంది స్త్రీలను చూస్తున్నారు. కలుసుకొంటున్నారు. మాట్లాడుతున్నారు. అయితే స్త్రీ పురుషులు పరస్పరం ప్రేమించి, సతీపతులైన పిమ్మట కూడా ఒక్కొకప్పుడు పరపురుషులను, పరస్త్రీలను చూచి వ్యామోహితులౌతున్నారు. కొన్ని సందర్భాలలో మనోనిబ్బరాన్ని కోల్పోయి, విభ్రాంత పరిస్థితిలో తమ బాధ్యతను గుర్తించకుండా ప్రవర్తించి, తమ సంసారాలను దగ్ధపటలం చేసుకొంటున్నారు.

ఈ విధంగా సర్వవిధాల సుఖాస్పదం కాదగిన సంసారాలు స్త్రీగాని, పురుషుడుగాని కొంచెం 'తమాషా'కనో 'కులాసా'కనో 'ఫర్వాలే'దనే సమాశ్వాసంతోనో వర్తించడంవల్ల ప్రమాదంలో పడుతున్నవి.

ఇలా సంచరించడంవల్ల ఎంతైనా ప్రమాదం వుంది. పరస్పరం అవిశ్వాసం, అనుమానం ప్రబలడానికి వీలు ఏర్పడుతుందికూడా.

అమెరికాలో కొత్త విధానం

పెళ్లిళ్లు అనేకంగా విఫలమై పోవడం వల్లను, విడాకుల సంఖ్య ఆనాటి కానాడు దారుణంగా పెరిగి పోవడంవల్లను అమెరికాలో "వివాహ సలహా సంఘాలు' వెలిశాయి. ఈ సంఘాలు పెళ్లి అయిన వారికీ, కానివారికికూడా అత్యంతోపయుక్తములైన సలహాలు ఇస్తూవుంటాయి. ఈ సంఘాలలో వుండే ఉద్యోగులు మనస్తత్వ శాస్త్రంలో ఆరితేరిన దిట్టలు. వివాహవిజ్ఞాన వేత్తలు.

వీరు దాంపత్య పాశబద్ధులుకానున్న, వారి నేమి, వివాహం జరిగిన పిదప పరస్పర సామరస్యం లేక సతమత మౌతున్న వారి నేమి, కన్యల నేమి కొన్ని కొన్ని తరహాలుగా విభజించారు.

దంపతులుగా నుండదగు వారికి 11 సూత్రాల నేర్పరచారు. అవి ఇవి.

1. కలిసిమెలిసి వుంటారా, ఏకాంతావాసాన్ని అభిలషిస్తారా. 2. తొందరగా కోపోద్రేకం పొందేరకమా, లేక శాంత మూర్తులా. 3. అనురాగ యుక్తులా, లేక జడస్వభావులా. 4. వీరి ప్రకృతి పరివర్తనం పొందగలట్టిదా, తీవ్రమైనదా? 5. సమాజ నిబంధన లనేవి, సనాతనాచారవ్యవహారా లనేవి కట్టు దిట్టంగా పాలించే వారేనా కాదా. 6. స్వతంత్రులా అస్వతంత్రులా. 7. సమాధాన పడదగు స్వభావమా, కాదా. 8. త్వరలో మంచి చేసుకోడానికి అవకాశ మున్న వారా, మొండి పట్టుదలగల వారా? 9. వీరికి ఓనం వుందా, సాహసిక స్వభావమా. 10. ఆదర్శ ప్రాయులా కాదా. 11. తాపత్రయపడుతూ చిరాకు పడే రకమా, కులాసాగా వుండే రకమా, ఈ 11 సూత్రాలను అనుసరించి, ఈ సంఘాలు స్త్రీ పురుషుల స్వభావాలను పరిశీలిస్తాయి. వీటికి అనుకూల సమాధానాలు ఎవరిపట్ల అనువర్తిస్తాయో, వారు ఏ విషయాన్ని అయినా వివక్షణతో పరికిస్తారనీ పదిలమైన మనస్సుగల వారనీ నిర్ణయించ వచ్చు. వారి వారి స్వభావాలు ఉద్రిక్తమైనవో, శాంతమైనవో కూడా నిశ్చయించ వచ్చు.

దాంపత్య విజయానికి మార్గాలు

దంపతుల గార్హస్థ్య జీవనంపైనే వైవాహిక సౌఖ్యం విశేషంగా ఆధారపడు తుంది.

స్త్రీ పురుషుల దాంపత్య సౌఖ్యాన్ని గురించి యోచించేటప్పుడు, వారి అనురాగలత సంవర్ధితం కాగల అవకాశాలను పరిశీలించేటప్పుడు యువతీ యువకులు పెరిగిన కుటుంబ పరిస్థితిని, వాతావరణాన్ని గమనించడం అవసరం.

పెన్సిల్వేనియా ప్రభుత్వ కళాశాలలోని వివాహ సలహా సంఘాధ్యక్షుడు మిస్టర్ క్లిఫర్డ్ ఆర్. ఆడామ్సు ఇలా వ్రాస్తున్నాడు.

“వధూవరు లిరువురూ తమ బాల్యాన్ని సుఖమయ వాతావరణంలో గడిపినారో, లేదో తమ తలిదండ్రులతో వారు నిశ్చింతగా, కులాసాగా, పొరపొచ్చాలు లేకుండా కాలక్షేపం చేయగలిగారో లేదో తెలుసుకోవడం చాలా అవసరం. వధూవరుల తలిదండ్రులు కూడా సుఖ భాజనమైన, నితాంత సంతోష తరంగితమైన సాంసారిక జీవితం నెరపినారో లేదో తెలుసుకోవడం ముఖ్యం.

‘మధురమైన — మనోజ్ఞమైన కుటుంబ వాతావరణంలో — కల్లోలితం కాని పరిస్థితిలో — సుశిక్షణ పొందుతూ పెరిగిన వారయితే ఆ వధువరుల వైవాహిక జీవితం ఆనంద ప్రదమై అలరారు తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. అట్టి పరిస్థితిలో పెరిగిన వారి హృదయాలు కూడా తటాలున ఉద్రిక్తం కాకుండా ఒక విశిష్టమైన పరిణతికి వచ్చేటట్లు నిర్ధారణ చేసుకో వచ్చును కూడా.”

తమ దాంపత్య జీవితమార్గం కంటకావృతం కాకుండా సుకరంకావడానికీ, సుగమంకావడానికీ వివాహానికి ముందే తలిదండ్రులుగాని, ఉపాధ్యాయులుగాని దాంపత్య జీవితంలోని ప్రాధాన్యాన్ని, పవిత్రతను గురించి ప్రబోధించడం అవసరం.

మానవ జీవితంలో ఈ స్త్రీ పురుషసంబంధం అనల్పమైన స్థానం ఆక్రమించు కొంటుంది.

“అనేక విషయాలలో మనం ఏ విధంగా అనుభూతి పొందుతామో, సంసర్గంలోకూడా అదేవిధంగా ఒక మితిని గమనించి వర్తించాలి. సంసర్గాన్ని భగవన్నియుక్తమైన పవిత్ర విషయంగా భావించాలి. సంసర్గాన్ని భగవంతుడు సృష్టికోసం నిర్దేశించినపుడు దానిని దుర్వినియోగ పరచడం మహాపాతకమే కాగలదు.

సృష్టికోసమే సంసర్గం నిర్దేశితమైనదనే విషయాన్ని గమనించకుండా, కాల, దురనియతిలేకుండా వర్తించేది జంతుకోటిలో Homo sapin అనే తెగ.

స్త్రీ పురుషసంబంధాన్ని గురించిన విషయాలను యుక్తవయస్సంధి పథంలోనున్న సమయాన అనభిలషణీయమైన లేక సందేహాస్పదమైన వర్గాలనుంచిగాక, సద్గ్రంథాల నుంచి నేర్చుకోవాలి.

దీనికి తలిదండ్రులు తమ బాలబాలికలకు తగు సౌకర్యం కలిగించాలి.

దాంపత్యధర్మాన్ని కేవలం తమ కామప్రవృత్తి తీరడానికి విచక్షణ లేకుండా దుర్వినియోగం చేసుకొనేవారు త్వరలోనే దుర్బలులై, రోగగ్రస్తులౌతారు. ఈ విషయాన్ని తెలుసుకోవడమే దాంపత్య విజ్ఞానోద్బోధకములైన గ్రంథాలను చదవడంలోని లక్ష్యం.

దాంపత్యం భగ్నంకావడానికి భార్యాభర్తలలో అనుమానం, అసూయ చాలావరకు కారణమౌతాయి. ఒకరిపట్ల ఒకరు నిష్కపటంగా వర్తించడమే ఏ పొరపొచ్చం లేకుండా భార్యాభర్తలు జీవించడానికి వీలుకల్పిస్తుంది.

వ్యాధిగ్రస్తులను, సంతానం గలవారికి పెళ్లి చేసుకోవడం వల్ల యువతులకు సౌఖ్యం కలగనేరదు. తనకేగాక, తన పిల్లలకుకూడా సేవచేయమని భర్త నిర్బంధించడంతో భార్య బడలిక త్రిగుణితమై మనోవేదన నాపాదిస్తుంది.

త్రాగుబోతులను, దుర్వ్యసనాసక్తులను పెళ్లి చేసుకోవడం కూడా వాంఛనీయంకాదు. తమ భర్తల స్వభావాన్ని తాము మార్చగలమని భావించడంకంటె పొరపాటు మరొకటి లేదు. కాగా యువతి దాంపత్య జీవితాన్ని కోరి, ఎవరినైనా పెళ్లి చేసుకోవలసినపుడు వారిలోని మంచి చెడ్డలను మొత్తముమీద గ్రహించి, నిర్ణయం చేసుకోవడమే యుక్తం.

★

స్త్రీలు

రవీంద్రుని అభిప్రాయాలు

★

రాధాదేవి రచన

★

సాధారణంగా కవులు స్త్రీలను శృంగార మూర్తులుగానే దర్శించి వారి రమణీయతకు దాసులౌతారు. కాని విశ్వకవిని స్త్రీల దైన్యమే యెక్కువ ఆకర్షించింది. సమాజంలో స్త్రీలకు కలుగుతున్న అన్యాయం, అక్రమం, అవమానం యీతని గుండెను కరిగించినాయి. అతని అమర గానం స్త్రీలపాలిట శంఖారవం.



రవీంద్ర మహాకవి గీతాంజలిలో తాను ఎల్లప్పుడూ బలహీనుల పక్కనూ, అభాగ్యుల పక్కనూ, దారి తప్పిన వారి పక్కనూ నిలబడి వుంటానని చాటించాడు. ఈ విశాల భారతభూమిలోని అసంఖ్యాకములయిన నరనారీ హృదయాలలో దాగివున్న మూగ వేదనంతా ఆయన మనస్సుతో అనుభవించాడు. ఆ బాధకి అమూల్యమైన భావనిచ్చాడు. అందువలననే ఆయన జాతికంతకీ ప్రతినిధిగా కంఠమెత్తాడు. ఆయన కేవలం భారతదేశంలోని పురుషుల మనస్సులనే ప్రతిబింబించి వుంటే జాతికి ప్రతినిధి అయేవాడుకాడు. మన దేశంలోని స్త్రీల కష్ట సుఖాలనూ, ఆదర్శాలనూ, ఆశయాలనూ, మనోభావాలనూ సానుభూతితో అర్థంచేసుకున్నాడు. తన రచనలలో స్త్రీల మనస్సులను కూడా చక్కగా ప్రతిబింబించాడు. అందుకనే రవీంద్రుడు భారత జాతి కంతకీ కవి అయినాడు!

సాధారణంగా కవులు స్త్రీలని శృంగార మూర్తులుగానూ, సౌందర్యరాసులుగానూ, దర్శించి విసుగెత్తేట్లు వర్ణిస్తారు. ఇతరమైన అందంకల వస్తువులు ఆకర్షించినట్లే కవులని స్త్రీలుకూడా ఆకర్షిస్తారు. రమణీయమైన వస్తువులంటే ప్రాణం విడిచే కవులు రమణులకు దాసులవుతారు.

కాని రవీంద్రుని విషయములో ఇది సత్యం కాదు. స్త్రీల సౌందర్యమూ, సౌజన్యమూ, సహనమూ ఆయనని ఆకర్షించక పోలేదు. ఆయన వాటిని కొనియాడక పోలేదు. వాటి కంటే నేటి స్త్రీల దైన్యమే అయనని ఎక్కువ ఆకర్షించింది. సమాజ దౌర్జన్యానికి గురైపోయి, అసహాయలై, అస్వతంత్రలై, వాపోతున్న వేలకొలది స్త్రీల దీన స్థితే ఆయనని ఎక్కువ ఆకర్షించింది. ఈ నాడు స్త్రీలకి మన సమాజంలో జరుగుతున్న అన్యాయం, అవమానం, అక్రమం, కవి గుండెని కరిగించినయ్. స్వేచ్ఛకోసం పోరాడుతున్న స్త్రీల మనసులలో ధైర్యాన్ని పురికొలుపుతూ నీవు అబలవుకావు, సబలవు అని సింహనాదం చేశాడు. శతాబ్దాల తరబడిగా తనని అణచి వేస్తున్న పురుష శాసనాలలోనూ, సమాజంలోనూ, స్వేచ్ఛకోసం పోరాడుతున్న స్త్రీల పక్షాన స్వేచ్ఛాపిపాసిరైన రవీంద్ర కవీంద్రుడు నిలబడటంలో ఆశ్చర్యమేమున్నది? స్వేచ్ఛని అణచే ప్రతి

శక్తికీ ఆయన ప్రబల శత్రువు. స్వేచ్ఛకోసం పోరాడే ప్రతి పక్షానికీ ఆయన పరమ మిత్రుడు!

ఈనాటి సభ్యతలో స్త్రీకి ప్రాముఖ్యం లేదు. స్త్రీని పక్కకు తోసి పురుషులే సభ్యతని నిర్మిస్తున్నారు. అందువల్లనే నేటి నాగరకత ఇంత పరుషంగావుంది; అందువల్లనే నాగరకతలో శక్తికే అగ్రపూజ. అందువల్లనే నాగరకత నిలబడ లేకుండా కుంటుకుంటూ ఒక యుద్ధంలోంచి మరొక యుద్ధానికి దారి తీస్తోంది. ఈ సభ్యత వినాశానికి కారకమయే శక్తులతో నిర్మితమయింది. ఇది కేవలం పురుషులే నిర్మించిన సభ్యత. ఇది ఒక్క పురుషులవైపుకే మొగ్గుతున్న సభ్యత. అందుకనే ఈ సభ్యత ప్రచండ వేగంతో ఒక వినాశంలోంచి మరొక వినాశానికి పరుగులు తీస్తోంది. ఈ విధంగా నేటి సభ్యతలో స్త్రీకి జరిగిన అవమానాన్ని, స్త్రీ ప్రకృతికి జరుగుతున్న అక్రమాన్ని రవీంద్రుడు విమర్శించాడు.

ఇప్పుడు సభ్యత చేయవలసిన దేమిటి? ఈ వినాశాల నుంచి సభ్యతని తప్పించటం ఎల్లాగు? మీ తప్పు దిద్దుకోవలసిన సమయం వచ్చిందని పురుషులను హెచ్చరించాడు. ఇంక మీరు ప్రవేశించి కిందా మీదా తెలియకుండా వున్న ఈ శక్తిని ఒక దారికి తీసుకు రావాలని స్త్రీ లందరినీ ఆహ్వానించాడు. ఈ పరుషమైన పురుష సభ్యత మీద మీ లాలిత్యాన్ని, మీ మాధుర్యాన్ని ప్రసరించండి అని స్త్రీలకి బోధించాడు. స్త్రీల సహనశక్తిని ధాత్రి ఓర్పుతో పోల్చి స్తుతించాడు. ఈ సభ్యతను పెంపొందించుటే కాదు, దానిని సరియైన దారిలో నడిపించుట కూడా మీ కర్తవ్యం అని స్త్రీలకి ప్రబోధించాడు.

వంట ఇంటి నాలుగు గోడల మధ్యనే స్త్రీ బాగా రాణిస్తుందని కొందరి అభిప్రాయం. రవీంద్రుడు ఇటువంటి వారికి చక్కటి సమాధాన మిచ్చి కళ్లు విప్పాడు. కరుణ, దయ, ప్రేమలవంటి ఉదారభావాలకు ఎక్కడ తావున్నదో అక్కడే స్త్రీ ప్రకృతికి తగిన ఆటపట్టు. అపార కృపామయుడైన ఈశ్వరుని దృష్టిలో మనుషులకు ఎటువంటి విలువ వుంటుందో ఆ విలువను ప్రేమమయి అయిన స్త్రీ గ్రహించ గలుగుతుంది. ఒక వ్యక్తిని సమాజం తాగుబోతని ఏవగించుకో వచ్చు. పొరుగువారంతా అవ్యక్తిని చూచి చీదరించుకో వచ్చు. కాని తల్లి చూపులో అతని కున్న విలువ సృష్టి కర్త దృష్టిలో అతనికున్న విలువవంటిది. ఈ ప్రేమ ప్రభావాన్ని జగత్తులోని దీనుల మీద, పతితుల మీద, అగతికుల మీద, అనాథల మీద ప్రసరించగల శక్తి స్త్రీల కున్నది. ఈ శక్తిని తాను సాగిన దూరమంతా ఫలవంతంచేస్తూ సముద్రాన్ని చేరే మహానదిలాగా విశాల మానవ లోకం మీద స్త్రీ ప్రసరించాలి. అంతేకాని, ఈ శక్తి నాలుగు గట్ల మధ్య చిక్కుకుని కదలలేని సరస్సులాగా, ఇంటి గోడలలో కట్టు పడిపోగూడదు. తన ఇంటిని తాను దిద్దుకుంటూ తన ప్రేమను జగతిలోని ఆర్తుల మీద, దీనుల మీద స్త్రీ ప్రసరించాలి. ఈనాడు స్త్రీ తన ఇంటి గోడల నుంచి బైటికి వచ్చి సమాజానికి చేయవసిన సేవ ఎంతయినా వుంది. ఈ బానిస దేశంలో బానిసలను కనటమే స్త్రీ పని కాదు. ఈ సంకెళ్లని విదిలించటానికి పాటుపడవలసిన బాధ్యతకూడా ఆమె కున్నది. అందువలన నువ్వు వంటయింటిగోడల మధ్యనే ప్రకాశిస్తావని స్త్రీని ఇంట్లో బంధించటం పురుషుల దౌర్జన్యం!

ఒకటి మాత్రం సత్యం. హృదయ సంబంధమైన కోమల శక్తులు ప్రసరించవలసిన ప్రతి పనిలోనూ స్త్రీకి అద్భుతమైన కార్యరంగమున్నది. హృదయ సామ్రాజ్యానికి స్త్రీ రాణి. ఆమెలాగా మరొకరు దానిని పాలించ లేరు.

పురుషులు పశుబలంతోనూ తృష్ణతోనూ నిర్మించిన ఈ సభ్యతలో స్త్రీని కేవలం ఒక విలాస వస్తువుగా, ఒక అందమైన అలంకారంగా భావించటం పొరబాటు. ఈ సభ్యతలో నుంచి హింసనీ, పోరాటాన్నీ పారద్రోలి శాంతినీ, సౌందర్యాన్ని, సౌమ్యభావాన్ని సామరస్యాన్నీ నెలకొల్పటానికి స్త్రీ ఎంతో అవసరవమౌతుంది. రాబోయే సభ్యతని నిర్మించటంలో పురుషుల కంటె స్త్రీలే ఎక్కువ ప్రాముఖ్యాన్ని వహించాలి.

ఈనాడు స్త్రీ పోరాడవలసింది తన హక్కుల కోసమే కాదు, తన వ్యక్తి స్వాతంత్ర్యం కోసమేకాదు, తన ఆర్థిక స్వాతంత్ర్యంకోసమేకాదు. స్త్రీని అణగ దొక్కివేస్తున్న ఈ పురుష సభ్యత అంతటితోనూ ఆమె యుద్ధం చేయాలి. ఒక వైపుకే మొగ్గుతున్న ఈ సభ్యత మీద తన సహజమైన


కోమలశక్తులను స్త్రీ ప్రసరించాలి. అప్పటికిగాని సభ్యతలో సమగ్రత ఏర్పడదు.

ఈనాటి సభ్యతలో వ్యక్తులకు విలువ శూన్యమై పోయింది. తమ శాస్త్రాలతో కల్పించిన వ్యవస్థల బరువుతో పురుషులు అణగారి పోతున్నారు. ఈ వ్యవస్థలు ధనానికి ప్రాధాన్యమిచ్చి, పోటీలు పెంచి, ధనదాహాన్ని హెచ్చుచేసి, వ్యక్తుల విలువను నాశనం చేసి వేస్తున్నాయ్. ఈనాడు వ్యక్తి విలువ అతని ధనాన్ని బట్టి, అతనికి సమాజంలోవున్న పలుకుబడిని బట్టి నిర్ణయిస్తున్నారు. ఇది మనిషి కల్పించిన విలువ. ఇది సృష్టికర్త వ్యక్తుల కిచ్చిన విలువ కాదు. అట్టి విలువను గ్రహించ గలిగినది స్త్రీలు మాత్రమే. ఆ విలువను కోలుపోయి ఎందరు వ్యక్తులో నేటి సమాజంలో అగౌరవానికి గురి అవుతున్నారు. అందువల్లనే ఈనాడు స్త్రీ తన ఇంటి గోడలను దాటి రావలసిన ఆవసరం మరీ ఎక్కువయింది. ఈ నాడు నిరుపయోగులుగానూ, అప్రధానులుగానూ పరిగణింబడు తున్న ధనహీనులనూ, విద్యాహీనులనూ, స్త్రీలు కాపాడవలసిన అవసరం ఏర్పడింది. శక్తి ప్రధానమయిన ఈ సభ్యతలో వ్యక్తికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టటానికి స్త్రీలే సమర్థులు. వారి ప్రేమ ఈశ్వరప్రేమ వంటిది. ఈ విశ్వప్రేమ సూత్రమే వారి దగ్గర పురుషులు నేర్చుకో వలసిన మహామంత్రం.

రాబోయే సభ్యతలో స్త్రీలకి ప్రాముఖ్యం వచ్చి తీరుతుందని రవీంద్రుడు కవికి సహజంగా వుండే దూరపు చూపుతో నొక్కి చెప్పాడు. ఇంతవరకూ స్త్రీలకి చేసిన అన్యాయానికి తగిన ప్రతిఫలం నేడు పురుషులు అనుభవిస్తున్నారు. ఇకముందు తప్పు దిద్దుకుని సభ్యతని నిర్మించే టప్పుడు స్త్రీలకి తగినంత ప్రాధాన్యం ఇస్తారు. అప్పుడు స్త్రీలు చెయ్యవలసిన దేమిటి? సభ్యతని సహకార సూత్రంతో వారు నిర్మించాలి. పురుషులలాగా దౌర్జన్యంలో, వైషమ్యంతో సభ్యతని నిర్మించ రాదు. శక్తి ప్రధానమైన ఈ సభ్యతకి స్వస్తి చెప్పి స్త్రీలు మైత్రీ, ధర్మంతో బద్ధమైన సభ్యతని నిర్మించాలి. తమ సహజమైన సహనంతోనూ, సౌజన్యంతోనూ. సానుభూతితోనూ, లాలిత్యంతోనూ, ప్రేమతోనూ, స్త్రీలు ఈ మహత్తరమైన కర్తవ్యాన్ని జయప్రదంగా నిర్వహిస్తారని రవీంద్రుని ఆశ. ఈనాడు అణిగి ఉన్నవారే రేపు నేలని ఏలుతారని బీసస్ చెప్పినట్లు ఈనాడు పురుషుల నీడలో ఒదిగి వెనుకబడి వున్న స్త్రీలే రేపటి సభ్యతలో ప్రముఖస్థానాన్ని వహిస్తారని కవీంద్రుడు శంఖం పూరించాడు.

ఇదంతా వింటే రవీంద్రునిది ఆదర్శతత్వ మనిపించవచ్చును. స్త్రీలని సింహాసన మెక్కించి పూజించ మంటున్నాడనిపించవచ్చును. అది పొరబాటు. ఆయనది చాలా వాస్తవమైన దృష్టి. ఆయన స్త్రీలని అనవసరంగా ఆరాధించమనటం లేదు. స్త్రీకి ఇవ్వవలసిన గౌరవాన్ని ఇవ్వటంలో వెనుదీయవద్దనే ఆయన బోధన. ఈ అభిప్రాయమే ఆయన తన చిత్రాంగద నోట అద్భుతంగా పలికించాడు. "నేను రాణిని కాదు. నేను దేవిని కాదు. సామాన్య రమణిని. నన్ను నెత్తిన పెట్టుకుని పూజించనూ వద్దు, నిర్లక్ష్యంతో పురుగులాగా దూరంగా దులిపి వేయనూ వద్దు. నేను సామాన్య స్త్రీని. నన్ను మీ పక్కన నిలబడనీయండి. మీ సుఖదుఃఖాలలో తోడునీడగా నిలబడ నీయండి" ఇంతకంటె స్త్రీ కోరదగిన దేమున్నది? కాదనటానికి ఏ పురుషుడికి అధికారమున్నది?

★



కథానిక

పెళ్ళి

శ్రీ జా. వేం. రా.

ఫ్లైనే కంపెనీలో గుమాస్తా గిరీ చేస్తున్న గస్టావ్, లూయీ తండ్రి దగ్గరకు వెళ్లి తనకు ఆమెను పెళ్లి చెయ్యమని అడగ్గానే, లూయీ తండ్రి వేసిన మొదటి ప్రశ్న యిది:

"నాయనా! నీకు నెలకు రాబడి ఎంత?"

"ఎనభై రూపాయలు కాని లూయీ నేను..."

"ఆ మాటల మాట అలావుండనీ. ముందు మాట నీ సంపాద్యం మీ ఇద్దరికీ చాలదు."

"అలా కాదండి. మేము ఎంతో గాఢంగా ప్రేమించుకొన్నాం."

"బహుమందిదయ్యా. ప్రేమించుకోవడం కూడదని నేననటంలేదు. నీ జీతం ఈ ఎనభయ్యేనా, ఇంకా ఇల్లు, భూమి పుట్రా ఏమన్నా వున్నాయా?"

"ఏమీ లేవు కాని అవసరమైతే మరికొంత కష్టపడి సంపాదిస్తా."

"ఎలాగని"

"కథలురాస్తా. నా కథలు మీరు చూడ లేదూ? సినిమావ్యాసాలుకూడా వ్రాస్తా. ఏ అచ్చాఫీసు వాళ్లకైనా సాయంకాలం ఓ గంట సేపు ప్రూఫులు దిద్దిపెడతా. ఏదో ఈ విధంగా 15, 20 రూపాయలు పీకకపోతానా?"

"పుస్తకాలేమీ వ్రాయలేదూ?"

"లేకేం? జెన్‌కిన్స్ లిమిటెడ్‌కు ఒక డిటెక్టివు నవల ఫ్రెంచిలోనుంచి ఇంగ్లీషులోనికి అనువదిస్తున్నా. ఈ మాట మరిచే పోయా. పేజీకి రూపాయన్నర ఇస్తారు."

"మొత్తం ఏమాత్రం వస్తుంది దీనిమీద?"

"రెండు మూడు వందల రూపాయలు వస్తాయి. ఇవి పెళ్లి ఖర్చులకు సరిపోతాయి" అన్నాడు గస్టావ్.

"పెళ్లి జరగాలే గాని ఉదయం కూడా ఫ్రెంచి భాషలో రెండు ట్యూషన్లు చెప్పుకుంటా." అన్నాడు మళ్లీ.

"ఏమన్నా వంద దాటదు. మీ ఇద్దరకు వంద రూపాయలు ఏదో విధంగా సరిపోయినా, పిల్లలు పుట్టుకొస్తే అప్పు తప్పదు."

"ఇప్పటినుంచి పిల్లలెందుకండీ? ఇప్పుడు దాన్ని గురించి బెంగ పెట్టుకోవడం దేనికి!"

"వెర్రివాడా! ఇప్పటి నుంచీ ఎందు కంటే మాస్తారా? పిల్లలు తప్పకుండా పుడతారని అంచనా వేసుకొనే ఎక్కువ సంపాదనకు పూనుకోవాలి. ఇంతకీ నా అంగీకారమే తరువాయి అంటావు. సరే, పిల్లనిచ్చి పెళ్లి చెయ్యడానికి ఒప్పుకున్నట్లే. బాగా సంపాదన మొదలు పెట్టు. ముహూర్తం నిర్ణయిస్తాను." అన్నాడు లూయీ తండ్రి రిచర్డ్.

గస్టావ్ ఆ మాట విని సంతోషంతో ఎగిరి గంతేశాడు. లూయీ అని పిలిచాడు. ఇద్దరూ ఆనందోత్ఫుల్ల వదనాలతో హాయిగా చెట్టాపట్టాలు వేసుకుని హోటల్‌కు చక్కా పోయారు.

ఇక అక్కడ నుంచి గస్టావ్ రోజూ సాయంకాలం వచ్చేవాడు. తాను అనువదిస్తున్న నవలను పూర్తి చేసి, ఆ ప్రూఫులు దిద్దడానికి తెచ్చుకొనేవాడు.

ఒకనాడు ఆమెను సినిమాకు తీసుకు వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు వాన వచ్చిందని టాక్సీలో ఇంటికి తీసుకు వచ్చి దిగబెట్టే సరికి ఎనిమిది రూపాయలయింది.

ఆ తర్వాత ఏదో ప్రయివేటు కుదిరింది. దానికైనా తిన్నగా వెళ్లక అప్పుడప్పుడు లూయీని షికార్లకు తీసుకు వెళ్లేవాడు.

పెళ్లి రోజు సమీపించిన కొలది తమ కాపరానికని అద్దెకు తీసుకున్న మేడ వాటాను అలంకరించుకోవడం, కుర్చీలు, బల్లలు, వంట సామగ్రి, బట్టలు మొదలైనవి కొనుక్కోవడంతో గడిచిపోయింది. ఈ సందడిలో పై సంపాదనకు గస్టావ్‌కు వీలు లేకుండా ఆటంకం ఏర్పడింది. పెళ్లి

అయిపోతే ఇక నిరభ్యంతరంగా సంపాదించుకోవచ్చునను కొన్నాడు గస్టావ్.

* * *

ముహూర్తపు రోజు ఆసన్నమయింది. పెళ్లి సలక్షణంగా జరిగింది. నవల ప్రతిఫలం పూర్తిగా ఖర్చయిపోయింది. ఆమెకు పెళ్లినాటికి కొన్న సిల్కు గౌనే 200 రూపాయల ఖరీదయింది. అద్దెకు తెచ్చుకొన్న పందిరి మంచంపై ముఖమల్ పరుపుమీద సంతృప్త చిత్తంతో నిద్రించిన ఆదంపతులు మరునాడు ఆదివారం కావడంవల్ల ఎనిమిది గంటల వరకు లేవనే లేదు.

కిటికీ నుంచి సూర్యరశ్మి లోనికి ప్రసరించింది. కిరణాలు అతని ముఖంపై సూటిగా ప్రసరించడంతో మెలకువ వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకొని సయంగా హోటలుకు వెళ్లి రొట్టె, కాఫీ తెచ్చాడు. అప్పటికి లూయీ లేచింది.

మరునాటి ఉదయం ఇద్దరు సరదాగా కోచ్ ఎక్కి బజారుకు వెళ్లి పటాలు, ఫ్లవర్ వేస్‌లూ పళ్లూ ఇంకా ఏవేవో కొనుక్కు తెచ్చుకున్నారు.

ఆ రాత్రి సర్కస్‌కు వెళ్లారు. ఇలాగే మొదటి నెల అంతా విందులు—పికార్లు, సినీమాలతో గడచి పోయింది.

ఇలాగ దంపతులు ఆనందమయంగా జీవితాన్ని మరి నెలల పాటు సాగించారు. లూయీ గర్భవతి అయింది.

ఈ మాట ఆమె తలిదండ్రులకి తెలిసింది. గస్టావ్ కూడా ఆనందించాడు. మగ పిల్లవాడు పుడతాడని గస్టావ్- ఆడ పిల్లని లూయీ వాదించు కొనేవారు. అయితే లూయీ మాత్రం ఒకందుకు భయపడింది.

"మీరు జీతం తప్ప మరేమీ సంపాదించడం లేదు. ముందు ముందు ఎంతో ఖర్చు వుంటుంది. ఇప్పటికే బాకీలన్నీ ఆ నెల కానెల పెరిగి పోతున్నాయి" అని హెచ్చరించింది.

'మరేం పర్వాలే' దని గస్టావ్ ఒక స్నేహితుడి దగ్గరకు అప్పుకు వెళ్లాడు. స్నేహితుడు ఇంత ఖర్చుచేస్తూ పిల్లలు పుట్టుకు వస్తే వాళ్లకు ఏం పెట్టి, నువ్వు ఏం తింటా ? వని చీవాట్లు పెట్టాడు.

వట్టి చేతులతో ఇంటికి వచ్చేసరికి ఎవరో ఇద్దరు తన కోసం వచ్చారని తెలిసింది గస్టావ్‌కు.

స్నేహితులనుకొన్నాడు గస్టావ్. కాని నౌకరు చెప్పిన దాన్ని బట్టి ఋణదాతలని తేలింది.

"ఏమండీ ! మనం చివరకు వీధిలో పడిపోతాం. ఇంటి యజమాని వచ్చి గింజుకుంటున్న సమయంలోనే గుడ్డల కొట్టువాళ్ల బిల్ కలెక్టర్ చెడామడా మాటలు పేలి చక్కా పోయాడు. ఇంకా పాలమనిషి, లాండ్రీ ఇవన్నీ తొందరగా తీర్చి వేయాల్సి వున్నాయి. ఏమన్నా అంటే మీకు కోపం వస్తుందని చెప్పడం లేదు." అంది లూయీ.

"అప్పుకోసం చూస్తున్నా పిల్లా" అన్నాడు.

"వీటికి తోడా ?" అంది.

"కాదు, ఆ అప్పుతో ఇవన్నీ ఒక్కసారి తీర్చివేద్దాం. మరేం భయపడక. రా కాస్త బీర్ త్రాగుదాం. ఈ చికాకంతా మరిచిపోవచ్చు." అన్నాడు గస్టావ్.

* * *

నెలలు నిండాయి, లూయీకి పురుడు వచ్చింది. ఆడ పిల్ల పుట్టింది. చేతిలో కానీలేదు. ఖర్చుకు డబ్బివ్వాలి. ఊయెల కొనాలి. బాలింతరాలికి పథ్యంపానం బోలెడు ఖర్చు భరించవలసి వచ్చింది.

లూయీ తండ్రితో చెప్పుకుంది. గస్టావ్‌ను పిలిచి "ఈ ఒక్కసారి మాత్రమే నేను సాయంచేస్తున్నాను. నాకు లూయీ ఒక్కర్తె పిల్లకాదు. ఇంకా నలుగురు వున్నారు. పైగా నేనైనా అంతడబ్బున్నవాణ్ణి కాను." అంటూ కొంత పైకం సర్దాడు రిచర్డ్.

మూడు నెల్లు గిర్రున తిరిగాయి.

"ఇకనైనా జాగ్రత్తగా మసలండి." అని తండ్రి హెచ్చరించాడు. అప్పులు పెరిగి పోతున్నా ఆడపిల్ల పుట్టిన ఆనందంలో వారికి ఆ బాధ కనబడ లేదు.

చివరకు స్టోర్సువాడు అరువు ఇవ్వనన్నాడు. పాలమనిషి "మేం మాత్రం బతకక్కర్లేదా ?" అని నాలుగు ఝాడిం

చింది. ఇంటి యజమాని నోటీసు ఇచ్చాడు ఖాళీచెయ్యమని.

గస్టావ్ సిగ్గుపడ్డాడు. దారిద్ర్య దేవతకరాళ రూపంతో సాక్షాత్కరించ సాగింది. బిడ్డ మాట లూయీకి ఆందోళన కలిగించింది. గస్టావ్ ముఖాన నెత్తురు చుక్క కనిపించడం లేదు.

అవ్యక్తికి కూతురి నిచ్చి ఎంత తెలివి మాలిన వాణ్ణైనా నని పశ్చాత్తాపడ్డాడురిచర్డు. తిన్నగా గస్టావ్ ఇంటికి వెళ్లి కూతుర్ని, బిడ్డనితన ఇంటికి తీసుకు వచ్చాడు.

భర్త వెనక దిగులుపడి కూచుని వుండగా తను లేచి రావడం లూయీకి కష్టంగానే వుంది. కాని వెళ్లక ఏం చేస్తుంది? ఇంట్లో డబ్బు లేదాయె. తినడానికి పూట తిండికైనా టికాణీ లేకపోయె.

లూయీ ఎక్కి వెళ్లినబండి మలుపు తిరగగానే అమీనాలు వచ్చి, ఇంట్లోని కుర్చీలు, బల్లలు, మంచాలు, పాత్ర సామగ్రి సమస్తము తీసుకొని పోయారు.

గస్టావ్ కృంగిపోయాడు. ఆ ఇంటిలో ఒక్కడూ నిలిచి, కిటికీ గుండా శూన్యంకేసి చూస్తూ బొరుమని ఏడ్చాడు. ఏడ్చి, హృదయాన్ని ఒక మూలలజ్జ, పౌరుషందహిస్తున్నా దుఃఖం తనువునే క్రిందకు క్రుంగదీస్తున్నా మామగారింటికి వెళ్లాడు.

"జీతంతో హోటల్‌లో తిని అప్పులు తీర్చు. ఆదివారం నాడు ఇక్కడికి వచ్చి, పెళ్లాన్ని పిల్లనీ చూడు. అయితే నువ్వు అమ్మాయితో ఒంటరిగా ఎప్పుడు మాట్లాడ్డానికి వీల్లేదు. రాత్రిళ్లు డెయిలీ గెజెట్ పత్రికలో ప్రూఫ్ రీడరుగా నీకు పని కుదిర్చాను. వదు" అని మామగారు నిష్కర్షగా చెప్పాడు.

గస్టావ్ ఏమీ అనలేదు. అలాగే రెండు నెలలు గడిచిన పిమ్మట అంతడు ఇంట్లో వుండడానికి మామగారు అంగీకరించాడు. లూయీ మాత్రం ఖడీరావ్—దూరంగా వుండి మాట్లాడ వలసిందే!

కనీసం ఇరవై ఏళ్లు కష్టపడ్డా గస్టావ్ ఆ ఋణాలు తీర్చడం అసంభవం. ఈలోగా మామగారు 'హరీ' అంటే నిలవ నీడకూడా వుండదు.

గస్టావ్ ఒక్కసారిగా తనపై పిడుగుపడితే బాగుండునను కున్నాడు. మానవ జీవితంలోని కఠోరతను తలచుకొని తీరని వెత చెందాడు.

"జంతుకోటికే ఆహారానికి అంత తాపత్రయం లేదు. సృష్టిలో ఒక్క మానవునకే తిండికి కాయకష్టం. భగవంతుడు నిజంగా వున్నాడా? ఉంటే మానవులపై ఈ కాఠిన్యం దేని"కని గస్టావ్ యోచిస్తూవుంటాడు ఇప్పటికీ.

(ఫ్రెంచి కథకు స్వేచ్ఛానువాదం)

★



కృతజ్ఞత

ఆంధ్రమహిళాసభ విద్యాలయ భవన నిర్మాణమునకై శ్రీ పిఠాపురం మహారాజావారు రూ. 50,000లు విరాళమిచ్చి యున్నారు. ఆంధ్ర మహిళోద్యమముపై వారు ప్రకటించిన ఆదరణకు ఆంధ్ర ప్రజ మహారాజా వారికి సర్వదా కృతజ్ఞులుగా వుంటారు.

జాతి జీవకళతో వెలుగొందాలంటే సేవానిరతిగల ప్రజా సంస్థలు దేశములో ఉద్భవించి సుస్థిరము కావాలి. ఈ నిర్మాణ కార్యక్రమము ఫలించిననాడే సంఘానికి శుభోదయము సిద్ధిస్తుంది. ఉద్రేక పూరితమైన వుద్యమాలను సృష్టించి ప్రజానీకముయొక్క దృష్టిని ఆకర్షించడము కష్టసాధ్యము కాదు. కాని ఒక్క విద్యాలయమునంటి సంస్థను ప్రతిష్టించి పోషించాలంటే సేవాభిలాషతోబాటు అకుంఠితమైన దీక్షకావాలి. ఒక్క సంస్థ విషయములోనే యింత బాధ్యత అవసరమైతే శిశు సంరక్షణాలయము, అనాథశరణాలయము, సారస్వత పరిషత్తు మొదలగు అనేక సేవాసంస్థలను నిర్మించి జాతీయాభ్యున్నతికి తోడ్పడుటకై యెంత కృషి అవసరమో వూహింపవచ్చును. ఇందుకు పిఠాపురము మహారాజావారికి ఆంధ్రదేశము ఋణపడి యున్నది.

ఆంధ్రులు స్థాపించిన అనేక సంస్థలకు పుట్టిలోనే సంధి కొట్టిన విషయము లోకవిదితము. ఇట్టి సంస్థల చరిత్రను పరిశీలించినట్లయితే వాటి పతనమునకు కారణము ధనలోపము కాక వ్యవస్థాపకులలో దీక్షలేమియే లోపముగా కనిపిస్తుంది. ఇట్టి పరిస్థితులలో మహారాజావారు స్థాపించిన సంస్థలే సుస్థిరమై నేటికీ ప్రజాసేవ చేయగలుగుతున్నాయంటే వారి ధర్మ చింతన, అకుంఠితమైన దీక్ష వెల్లడి అవుతుంది. దిట్టముగా అల్లుకొని యున్న రాజకీయ వైషమ్యాలను అతిక్రమించగల శక్తి ప్రస్తుత కాలము నోచి యుండ లేక పోవచ్చును; కాని, జాతీయాభ్యుదయమునకు గొప్ప దోహదము కల్పించిన, సుస్థిరమైన వీరి సంస్థలే అనాదిగా నిల్చియుండి, మహారాజావారి సేవానిరతిని వేనోళ్ల చాటుతూ వుంటాయి.

స్వర్గీయ మహారాణీ చిన్నమాంబగారే మహారాజావారి ఆదర్శజీవితానికి మార్గదర్శకులు. మహిళా లోకానికి శిరోభూషణమైన రాణీ చిన్నమాంబగారి దివ్యస్మృతికి చిహ్నముగా ఆంధ్ర మహిళాసభ విద్యాలయము ప్రకాశించడానికి మహారాజావారి కానుక తోడ్పడగలదు.

★

శాలివాహన్

కథాసంగ్రహం

గ్రహగతుల ఫలాఫల యోగములు భూప్రజకన్న మిన్నగా భూభారము నంతటిని వహించుతూన్నాడని ప్రథకల ఆది శేషునకు అనువర్తించలేవు.

పంచగ్రహకూట మేర్పడనున్నదని తెలుసుకొని ఆది శేషుడు, సన్యాసి వేషమున గోదావరీ స్నానమునకు బయలు దేరినాడు.

ఈ మహాపుణ్యకాలమున దాంపత్య ధర్మము నెరపినచో అతేవ భాగ్యశాలియైన సుతుడుదయించగలడని, పరదేశి యగు అవధాని అను బ్రాహ్మణుడు, సత్వరముగా గృహోన్ముఖుడయినాడు. కాని, మార్గమధ్యమున గోదావరి వెల్లువ అతనికి దాట శక్యము కానిదైనది.

సన్యాసి వేషముననున్న ఆదిశేషుడా బ్రాహ్మణుని సంకల్పము వృథాకారాదని, అతనికి సాయపడి, చేరువనున్న ఒక కుమ్మరివాని కుమార్తె స్వరూపను అతడు పత్నిగా గైకొనునటుల ఏర్పాటుచేసెను. తత్ఫలితముగా ఆ పడతికి శాలివాహన సుతుడుదయించినాడు.

ఆ కాలమున ఉజ్జయినిని పాలించుచున్న విక్రమాదిత్యుడు, దుర్నిమిత్తముల పొడగని, ఆస్థాన జ్యోతిషుని పిలిపించి అడుగగా, గోదావరీ తీరమున ఒక కుటీరములో, భవిష్యత్తున ఈ దేశమునకు రాజు కాగల బాలకుడుదయించుటయే అందులకు కారణమని అతడు వివరించెను. ఆ పసి పాపను చంపివేయుమని విక్రమాదిత్యుడు భేతాళుని నియోగించెను.

ఈ సంగతి, సన్యాసికి తెలిసి, కుమ్మరికి ఈ యుదంతము నెరిగించి, ఆ బాలకుని స్థానమున ఒక మట్టిబొమ్మను ఉంచి, వానిని గుప్తస్థానమున సురక్షితుడుగా నుంచుటకు ఏర్పాటు గావించెను. భేతాళు డీ పన్నాగమును పసికట్టనందున, పాపడు మడిసినాడని విక్రమార్కుడు నిర్భయుడయినాడు.

ఆ పుత్రవానికి శాలివాహనుడని నామకరణము చేసి, సన్యాసి వానిని చతుష్షష్టి కళాకుశలునిగాను, రాజ్యాధికార నిర్వహణయోగ్యునిగాను ఒనరించెను. వీరికి సయిదోడుగా, నందిని అను ఇరుగుపొరుగు బాలికను స్వరూప తనకన్న కూతురివలెనే పెంచుచుండెను. ఇరువురునూ అన్నచెల్లెలవలె కలసిమెలసి ఆటపాటలతో క్రమముగా వర్ధిల్లుచుండిరి.

ఒకనాడు, నందిని, లేడి బొమ్మతో ఆడుకొనుచుండగా, మహాధనపురాధి నాయకుడగు భూముఖుని కుమార్తె, చంద్రలేఖ ఆవాడను పోవుచూ, ఆ బొమ్మనుచూచి ముచ్చటపడి, తనకు దానిని ఇయ్యుమనగా నందిని నిరాకరించెను. చంద్రలేఖ బలాత్కారముగా తీసికొని నగరుకు పోవుచుండెను. శాలివాహను డిది యెరిగి, పరుగునపోయి చంద్రలేఖ మార్గమును నిరోధించెను. ప్రథమ వీక్షణముననే, వారికి అనురాగోదయమయ్యెను; కాని అది వారు గ్రహించలేదు.

భూముఖు డీ సమాచారమును చంద్రలేఖ చెలికత్తెవలన విని శాలివాహనుని బంధింపుడని భటుల నియోగించెను. చంద్రలేఖ వలదని ఎంతగా బ్రతిమాలుకొన్ననూ అతని మనసు కరుగదాయెను.

ఈలోగా, చంద్రలేఖ స్వయంవర ముహూర్త మాసన్నమయినది. రాజులందరూ, విక్రమార్కునితో సహా, తమ ప్రాభవము మెరయించుచూ విచ్చేసి, ఎవరికి వారే, యామెను భార్యగా బడయ మువ్విళు లూరుచుండిరి. కాని, చంద్రలేఖ చిత్తచోరు డెవడో, అతడా సదస్సులో కానరాడు.

ఇంతలో నొక విచిత్రము :

శాలివాహను డెటులనో చెరనుండి తప్పించుకొని, గజాధిరూఢుడై స్వయంవర మంటపమున కరుదెంచినాడు. చంద్రలేఖ తన ప్రియుని కంఠసీమను స్వయంవర దామముతో నలంకరించినది.

ద్వంద్వయుద్ధములో శాలివాహనుడు బాహుబల గర్వితుని విక్రమార్కుని పరాజితు నొనరించినాడు. ఇన్ని జరిగిననూ, ఇంకనూ, శాలివాహనుని జామాతగా స్వీకరించుటకు భూముఖు డంగీకరించుట లేదు. ఆ తరుణమున, ఆదిశేషుడు, సాక్షాత్కరించి భూముఖునికి శాలివాహనుని జన్మవృత్తాంతము నెరిగింపగా, అతడు పరమ ప్రమోదముతో, కుమార్తె నొసగి వివాహ మొనర్చి, తన రాజ్యమును పట్టము గట్టినాడు.

స్త్రీ కంఠము

శ్రీ కవికొండల వేంకటరావు

స్త్రీ యొక్క కంఠమే ధరించగలదు, కంటె కాసుల పేరు, స్త్రీ యొక్క కంఠమే వెలిబుచ్చగలదు "ఊర్మిళా దేవి నిద్ర" "లక్ష్మణ దేవర నవ్వు" అసలు స్త్రీ కంఠ రూపమే అపురూపం. మగవానికి గడ్డం పెరిగి కప్పడ్డట్టు స్త్రీ కంఠము కప్పడి వుండదు. విస్పష్టంగా వేర్పాటుగా సృష్టిలో కనిపిస్తుంది. ఆమె కంఠధ్వని కూడా అట్టిదే. విస్పష్టంగా వేర్పాటుగా విని విస్తుంది.

ఈ ప్రత్యేకత ఆంధ్ర దేశంలో ముఖ్యంగా సారస్వత సంబంధమైనదై నాకు రిచ్చ గొలుపుతుంది. స్త్రీలే పాడవలసిన పాటలుగాని, స్త్రీలే పాడగలుగు చరణాలుగాని స్త్రీ లోకానికి మాత్రమే పట్టుబడు వరుసలుగాని వున్న దేశం మన ఆంధ్రదేశం వంటిది మరొకటి వుంది అని అనుకోను. స్త్రీల పాటలు మగవాడు కనుక ఎవడైనా ఆంధ్ర దేశంలో పైకి పాడాడా వాణ్ణి వెంటనే ఆడంగి పెద్దమ్మ అని ప్రజలు పరిహసిస్తారు. ఆ పాటలే స్త్రీ వ్యక్తి కనుక పాడినట్టాయినా ముద్దుగా ముచ్చటగా హెచ్చరిగ్గా సద్దు సేయకుండా సభవారందరూ ఆలకిస్తారు, విలోకిస్తారు. అయితే మగవాళ్లు చెబుతూన్న పురాణాలు ఆడవాళ్లు అక్కడక్కడ చెప్పడం కద్దు. హరి కథలు నప్పించడంలో ఎడపదడపా స్త్రీలు అగ్రస్థానం వహిస్తూవున్నారు. ఉపన్యాస ధోరణిలోను, ఉద్యోగ వేషధారణలోను చెప్పక్కరనే లేదు "లా" Legal practitioner's Act (Women's Act) అని Pass చేయించుకో గలిగారు స్త్రీలు. ఇలా అదివరలో మగవానిదే ప్రజ్ఞ అని అనుకొన్న శాఖలన్నీ స్త్రీలు ఆక్రమించు కుంటూవున్నారు. మన మగవాళ్లున్నూ స్త్రీలకే మాత్రం తీసి పోకుండా వారి పాకకళ, వారి పెదవుల నున్నందనం, వారి హృదయాల మెత్తందనం ఇలాంటివి అలవరచుకుంటూ వున్నారు. కాని స్త్రీల పాటల దగ్గఱకు వచ్చేసరికి అవి తమవి కానట్టు తమకు తమకు సాధ్యంకానట్టు వదలి వేస్తున్నారు. పాటలో లింగ భేదం అన్నంత కేటాయింపై నాటికీ నేటికీ స్త్రీల పాటలు ప్రత్యేకత మిన్నముడుతున్నాయి అన్నా అతిశయోక్తి కాదు. ఆ ప్రత్యేకతను తెలుసుకోవడం మానేసి నేటి విమర్శకులు కొందఱు వాటిని సర్వసామాన్యమైన నామరూపాలలో చేర్చేంటూ folk songs అని ballads అని ఇలా పిలుస్తున్నారు. నా ఉద్దేశ్యంలో అవి folk songs కావు, ballads కావు. అవి కేవలం ఆడవాళ్ల పాటలు.

ఆడవాళ్లు మగవాళ్లకు ఏలా ప్రేమార్హులయ్యారో అదే మోస్తరుగా వాళ్ల పాటలన్నా మగవాళ్లు మోజు పడుతూ అందలి రసం ఆస్వాదించవచ్చు. మగవాళ్లే అందలి రసం సరిగా ఆస్వాదించగలరేమో కూడా.

వీధంట రాంభజనలాగు రంయిమనిపించ వలసినవి కావు ఈ పాటలు. ఈ సారస్వతం యొక్క ఉత్తేజానికి ఉనికి పట్టు స్త్రీ లోకం. స్త్రీ లోకం అర్థమైనప్పుడే వారి సారస్వతం అర్థంకావడం. నట్టింట నారీమణి నానతో తేనె సోనగా పాడేటప్పుడో, ముంగిట బిచ్చకత్తె ఇంగితంతో ఆలాపించేటప్పుడో, విని నేర్చుకో వలసినదే గాని గురుముఖతా వచ్చేది కాదు ఇతర విద్యల్లా ఈ విద్య.

"పిన్ని పాట విని చాలా కాలమైంది" పిన్నికి ఓ అరవై డెబ్బై యేళ్లుంటాయి. వృద్ధ వితంతువు పల్లెటూరిలో సందె గుమ్మాలాడుచ్చుకొనే ముందు తీరిగ్గా అరుగు మీదకు అంగనలు తరుచుగా చేరుకొనే సమయం, సాంకేతిక స్థానమూను. "రా అమ్మా! వినే వానే వాళ్లు వుంటే ఎన్ని పాటలైనా వినిపిస్తాను" అంటుంది పిన్ని. అంటూ అరుగు మీది నుంచి నాలుగిళ్ల భవంతి లోపలి గుమ్మం దాటించి నడవలో కూర్చోబెడుతుంది అయినమ్మనూ కానమ్మనూ. ఎంత మంది ఎన్ని పాటలు ఆమె ముఖతా ఎన్నాళ్లు విన్నా

పాటలలో సారస్వతం

తనివి తీరదనుకోండి—ఏకాంత సేవలు, సతీపతి సంవాదాలు, తలుపు వద్ద పాటలు, లాలి పాటలు, జోల పాటలు

బంతుల పాటలు, తలంటు పాటలు, నలుగు పాటలు, గౌరీ కళ్యాణము, పెళ్లి పాటలు, వియ్యాల వారి పాటలు, వడిసె పాటలు, బువ్వంబంతి పాటలు, వరస పాటలు, సువ్వి పాటలు, అప్పగింత పాటలు, పెళ్లి కొడుకు పాటలు, గుమ్మి పాటలు, గొబ్బి పాటలు, ప్రణయ కలహమాలిక సంవాద, కృష్ణ పుట్టుక ఇత్యాదులు. మంగళ కర్పూర హారతి పాటలు, మేలుకొలుపు పాటలు, జలక్రీడ పాటలు, సమర్త పాటలు, విందు పాటలు, అలక పాటలు, గంధము విడెము, పానుపు, పవ్వళింపు, శోధనము, భావ పూజావిధి పాటలు అన్నీ వచ్చు పిన్నికి!—

పాడే పిన్ని స్త్రీ. వినే అమ్మలక్కలు స్త్రీలు. ఆ సభలో వొక్క మగపురుగన్నా వుండటానికి వీల్లేదు. సర్వ సాధారణంగా ఆడవాళ్లకు ప్రబంధ పురాణాలద్వారా అవితేం, మంత్రోపదేశాల గుండా అవితేం, విజ్ఞానం కలిగించేది మగవాళ్లు. కాని ఇక్కడ ఆడదే ఆడవాళ్లను ఆకర్షిస్తూ ఎంచక్కటి సారస్వతం నోటి వాటుగా అందిస్తుంది. పర పురుషసంపర్కం సన్ని వేశం అంటే చంపేసేస్తుంది పిన్ని.

పాంచాలీ పరిభవం అనుకొంటాను పాడింది ఆ పొద్దు ఆపె. సరిగ్గా నేను చుట్టపు-చూపులాగా వారి వీధి గుమ్మంలో అడుగు పెట్టాను—దుశ్శాసనుడు ద్రోపదిజుట్టు పట్టుకొన్నప్పటి ఘట్టం కాబోలు ఆ చరణం—

"ముత్యాల చేరొచ్చి ముందుకూ పడిరెు" అని పాడింది. పాడి ఆగింది. ఆగి అభినయిస్తూ మళ్లీ పాడింది. తరువాత నన్ను చూచి మానేసింది కాసేపు. మానేసి "సుబ్బ్రటా! ఎప్పుడొచ్చావు?" అంది. ఇలా నన్ను కుశల ప్రశ్న వేస్తూ నేమిటో చరణం విసిరి ఆడవాళ్లనందరినీ సాగనంపింది. "రేపు రాండమ్మా" అని ఆమతో చరణంలో నాకు వినబడ్డ పలుకు "రాజుల్ల రాజు" "రాజ రాజు" కు పాటలో "రాజుల్ల రాజు" అని వాడాడు రచయిత. ఏమి తెనుగు తేట వెల్లడించాడు అని రిచ్చపోయాను.

ఆమె పాడే పాటలో గొప్ప పాట ఏదో చెప్పకోండి! ఏకాదశి మహాత్మ్యం. అది తప్పితే గోవు పాట. కాని మహాకళ ప్రతిపాదించవలసి వుంటే నా వూహలో "ఊర్మిళా దేవి నిద్ర" గాని "లక్ష్మణ దేవర నవ్వు" గాని లెక్క కొస్తాయి. మరింకా "చిలుక ముగ్గుల పాట" "కామేశ్వరి పాట" కూడా వున్నాయి. అప్పుడప్పుడు ఆమెకు తన యౌవన విలాసంతలపోతకు వస్తే "చిలుక రాయ బారం" పాడుతుంది, లేదా "రుక్మిణి దేవి సీమంతమో" "సీత సమర్తో" విని పిస్తుంది.

వీటన్నింటల్లోనూ వున్న పెద్ద విశేషం ఏమిటంటే ఈ పాటలన్నీ మొత్తం మీద హిందూ స్త్రీల యొక్క తీరు బడి సెయ్యాన్ని, కోరికల తియ్యాన్ని వేనోళ్ల చాటుతూంటాయి అని నా అభిప్రాయం. ఒక్కొక్క పాట ఒక్కొక్క ఖండకావ్యం మాదిరిగా ఎక్కడో ప్రారంభమౌతోంది; ఆకాశ వీధినుంచి ఊడిపడె చుక్కల్లే. అంతే గాని "అక్కథకుండు" మీద ఆధారపడి వుండదు. తుది భాగంకూడా అలాగ్గానే ఎదో మరుక్కవకు దారి తీస్తుంది. ఉదాహరణకు—"లక్ష్మణ దేవర నవ్వు" తీసికోండి. అది నవ్వును గురించి పాట కావడం వల్లనేమో రచయిత తొలీ చరణం ఇలా గానం చేసేడు.

"వెన్నెలతైలనేవేల నంఖ్యలనూ"
"గద్దెలు బెట్టించి కరుణాకరూలు"

వెన్నెల—నవ్వు రెండు తెలుపు వర్ణానివే. ఆ నవ్వును పుచ్చుకుని ఎంతమంది లోపాలో కనబరుస్తాడు కవి. కాని వడ్ల గింజలో బియ్యపు గింజలా ఆ నవ్వుకో పెద్ద కారణం తీరా మోసి చూస్తే కాపడదు. కాని ఉన్న చిన్న కారణం లక్ష్మన్న చెబుతూవుంటే అతి అమాయకంగా అతినీతి దాయకంగా, కన్నుల గట్టినట్లు కనిపిస్తూంది. ఆ తరువాత కతపట్టు అంతా వేడుకాముస్తాబూ అందమూ ఆనందమూను

"వెండయ్య వెయ్యివెయ్యి కాగుల వేణ్ణీళ్లతోడి
తమిడయ్య పది కాగుల చన్నీళ్లతోడి
చన్నీళ్ల వేన్నీళ్ల సమముగా తోరపి"

మఱొక్క గమనింపు. శ్రీరామునకు కోపం వచ్చినా అట్టిదే ఆక్కటికం హెచ్చినా అట్టిదే

"కొలువులో నవ్వేంకు కోపించె రాజా
తల తెగవేతునని తా ఖడ్గమెత్తె"

పాట మొదలు సూచింపబడిన ఆగ్రహపు రాముడు పాట చివర ఎక్కడ లేని అనుగ్రహపు రామునిగా మారిపోతాడు. ఏలా అంటే, హనుమంతుణ్ణిట అందరితోను భోజనానికి కూర్చోమంటే అతగాడు ఆ హనుమన్న

" పొత్తున గూర్చుండ వుత్తమునిగాను "అని
" సర్వేశు భోజనము తా గాగ జూచి
మందార పల్లెంబు మెత్తుకొని పోయె
తా బోయి హనుమన్న అవిసె చెట్టెక్కె "

అప్పుడు శ్రీరాముడు

" చెయిజాచి హనుమన్నను రమ్మని పిలచె
రామచిలుకావలె చేతిపయి వ్రాలె
చేతిపయి హనుమన్నను ధరణిపై దించి
ముత్యాల హారమ్ము మెచ్చి మెడవేసె"

పాటలో సమగ్రత ఎక్కడ వుందీ అంటే శ్రీరాములకు పరిచర్య గావించిన పరమ భక్త లిద్దరే. శ్రీలక్ష్మణస్వామి వారున్నూ, శ్రీమదాంజనేయస్వామి వారున్నూ. రచయిత శ్రీరాముల వారిచేత శ్రీలక్ష్మణస్వామి వారి పాదా లొత్తిస్తాడు ఒక చోట. మరోచోట ఆంజనేయస్వామి వారిని ఎత్తుకునేటట్టు చేస్తాడు.

ఈలాగ్గా ఒక్కొక్క పాట తీసుకుంటూ ఆడవాళ్లు పాడుకునే పాటలన్నీ కనుక వివరంగా పరీక్షిస్తూ అఖండమైన కళ కనిపిస్తుంది. ఆ పాటల్లోకన్నా కూడా ఆ పాటలు వాళ్లు పాడుకుంటూ కథలో వచ్చే సరసాలకు సరాగాలాకు నవ్వుకుంటూ కులుక్కుంటూ వాళ్లు సుఖం అనుభవిస్తు వుండేటప్పటి వాళ్ల కళ వుండే ఆ కళ మరీవింత అని అనిపిస్తుంది. పాటలోని స్త్రీకి పైనివున్న స్త్రీకి అభేద భావం కనిపిస్తుది.

" భమిడి పానుపున నొలసియుండె
నొక వదునాలు గేండ్ల పణతి "

Sleeping beauty! ఎవరూ? ఊర్మిళ!

" కుందనపు ప్రతిమ కళలు యీ కళ
యెందుండి దాగున్నదో।"

అని అన్నట్లు అనక తప్పదు హైందవ స్త్రీ తన పాటను తాను మేలుకుంటూ మార్పు దేశాన్ని మేలు కొల్పేటప్పుడు!

★

చిన్న చిన్న మొత్తములలో డబ్బును దాచుకొనే విధానము

యుద్ధమునకై ధనమును సేకరించుట ఈ విధానముయొక్క ఉద్దేశముకాదు. ఎల్లప్పుడును డబ్బును దాచుకొనునట్లు ముఖ్యముగా బీదజనులను ప్రోత్సహించుటయే దీని ఉద్దేశము. దాచుకొను మొత్తములు యెంత చిన్నవైనను, వానిని తెలివితేటలుగలిగి నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లలో దాచుకొని, అందుమూలముగా జాతీయ ఐశ్వర్యములో రాజ్యముయొక్క భాగస్వాములై వారియొక్క జీవిత ప్రమాణమును హెచ్చించుకొనునట్లు చేయుట ఈ విధానముయొక్క వుద్దేశమైయున్నది.

మునుపటివలెనే యిప్పుడుకూడ వ్యక్తులును, దేశీయులందరును ధనమును దాచుకొనుట మిగుల అవసరమైయున్నది. ఎందుకనగా, సరఫరాలు యింకను కొంతకాలమువరకు యెక్కువ కావు. అట్లు యెక్కువగునంతవరకును అధిక చలామణి అమలులో నుండగలదు. ఇంతే కాకుండా వేర్వేరు యుద్ధానంతర పునర్నిర్మాణ కార్యములకు ధనము కావలసియుండును.

శాంతి స్థాపనకు ధనమును దాచుకొనుడు. యుద్ధానంతర పునర్నిర్మాణమునకు కూడ ధనమును దాచుకొనుడు.

అట్లు దాచుకొన్న ధనమును నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లలో వేసికొన్నయెడల లాభించగలదు.

విలువ : రూ. 5 లనుండి రూ. 5000 ల వరకు.

వడ్డీ : సంవత్సర మొకటికి నూటికి 4⅙ వంతుల చొప్పున సాధారణవడ్డీ లభించును. 12 సంవత్సరముల పూరా కాలపరిమితి చివర, పెట్టుబడి పెట్టిన మూలధనము నూటికి 50 వంతులు ఈ వడ్డీవలన పెరుగగలదు. వడ్డీమీద ఆదాయపు పన్నులేదు.

రొక్కముగా మార్చుకొనుట : రూ. 5 ల సర్టిఫికేట్లను 1½ సంవత్సరముల తరువాత రొక్కముగా మార్చుకొనవచ్చును. తక్కినవాటిని పెరిగిన వడ్డీతోకూడ 2 సంవత్సరముల తరువాత రొక్కముగా మార్చుకొనవచ్చును.

ఒక మనిషి రు 5000 ల గరిష్ఠ మొత్తమువరకు కొనవచ్చును. సహకార సంఘములు, సభలు, స్థానిక సంస్థలు మొదలైనవి యింకను యెక్కువ గరిష్ఠ మొత్తమువరకు కొనవచ్చును.

సర్టిఫికేట్లు అంగీకారముపొందిన ఏజెంట్లవద్దను, పోస్టాఫీసులలోను, సేవింగ్సు బ్యూరోలలోనూ దొరకును.

ఆర్థిక దాస్యము

ప్రపంచంలోని విషమ పరిస్థితులకు, యుద్ధాలకు ఎన్నిటికో కారణాలు ఆర్థిక సంబంధమైనవి. అలాగే స్త్రీల సమస్యలలో మూలమైనది ఆర్థిక దాస్యము. దాని వలననే ఇతర సమస్య లెన్నోకూడా వస్తున్నాయి.

చాల దేశాలలో స్త్రీ ఆర్థికంగా పురుషుని మీద ఆధారపడి ఉంటుంది. మన దేశంలో ఇది మరీ ఎక్కువ. ఇతర దేశాలలో స్త్రీ పిత్రార్జితంలో కొంతభాగం వారసత్వంగా పొందడానికి హక్కు కలిగి ఉన్నా మన హిందూలా ప్రకారం ఆమె స్థితి చాలా అధోగతిలో ఉంది. మూడు తరాలుగా పురుషవారసు లెవరూ లేనప్పుడే ఆమెకి దక్కుతుంది, ఆస్తి. ఒక వ్యక్తి ఆస్తి అతడి కూతురికి కాక, అన్న మనుమడికి వెళ్లడం ఎంత హాస్యాస్పదంగా ఉందో కాని అది యదార్థత.

మన హిందూసంఘంలో స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం పూర్తిగా ఖండింప బడింది. స్త్రీ చిన్న తనంలో తండ్రి మీద, తరువాత భర్తమీద, తరువాత కొడుకుమీద ఆధారపడి ఉండాలని నిర్ణయింప బడింది. ఆమె రెక్కలమీద ఆమే ఏదశలోనూ ఆధారపడడం గర్హ్యము. మధ్య తరగతి, ధనిక తరగతులకు చెందిన స్త్రీలు అందుచేత పురుషుని మీదే ఆధార పడతారు. వాళ్లు చిన్నప్పటి నుండీ పురుషుని మీద ఆధార పడుతూ, పురుషునికి కంటులక్కగా ఉండడానికే తయారు చేయబడు తున్నారు. ఒక్క బీద తరగతి స్త్రీలు మటుకు గతి లేక, భర్త సంపాదన ఏ మూలా చాలక, వాళ్లుకూడా పని చేసి ఆర్జిస్తారు.

ఇతర దేశాలలో స్త్రీలకు వారసత్వపు హక్కులున్నా, అక్కడ స్త్రీలు పురుషులమీద ఆధారపడడం ప్రోత్సహించ బడుతుంది. పురుషుడికి ఇల్లు చక్క బెట్టే మనిషి, వంట చేసిపెట్టే మనిషి అవసరం కనుక అక్కడా స్త్రీని అందుకు ప్రోత్సహించి, ఇతర విధాల ఆమె స్వేచ్ఛనరికట్టి, అందులో ప్రవేశపెడతారు. జర్మనీ ఇటలీ దేశాలలో ఫాసిస్టు ప్రభుత్వం క్రింద స్త్రీ స్వయం పాదన తీవ్రంగా ఖండింప బడింది. వారిమీద ప్రభుత్వజులుం హెచ్చయింది. దానితో ఎంతో మంది స్త్రీలు ఉద్యోగాల నొదులు కొని వంట ఇళ్లలోకి తప్పు కున్నారు.

స్త్రీ పురుషు లిరువురూ సమానులే అని ఒప్పుకున్న వారెవరూ, స్త్రీ పురుషుని మీద ఆర్థికంగా ఆధారపడి ఉండాలని చెప్పరు. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని తనకిష్టము వచ్చిన పనులు చేస్తూ తన మీద ఆధారపడి ఉండమని బలవంత పెట్టడానికి అధికారము లేదు. కాని పురుషుడు తన సుఖవు కొరకు అలా ఆమెను నిర్బంధిస్తున్నాడు. వంట ఇంట్లో కట్టి పెడుతున్నాడు. ఆమె అలా ఉండడానికి ఆమెను చిన్నప్పటినుండి ఇతర పనులకు చేతకాని దానినిగా చేస్తున్నాడు. నిస్సహాయత్వం చేతను, అజ్ఞానం చేతను ఆమె అలా ఉండి పోతూంది.

ఆర్థికంగా బానిసగా ఉన్న వ్యక్తి జీవితం చాలా దుర్భరంగా ఉంటుంది. ఆమెకు దేనికీ స్వాతంత్ర్యముండదు. ఒక కానీ కూడా భర్త అనుమతి లేనిదే ఖర్చు పెట్టడానికి నోచుకోనని స్త్రీకి స్వంత అభిరుచులుండడానికి అవకాశ మెక్కడ? ఆమెకు వ్యక్తిత్వమే పోతుందని చెప్పాలి.

ఏ తరగతి స్త్రీ అయినా స్వయం సంపాదన లేనప్పుడు, భర్త ఇష్ట ప్రకారం నడవ వలసిందే. ధనవంతులలో నాగరికత ఒక ఫాషను కనుక భార్యలకు కొంత కల్చరలు అభివృద్ధి కలుగ చేస్తారు పురుషులు. మధ్య తరగతి పురుషులు దాని గురించీ బాధపడరు. స్త్రీలను అన్ని విధాలా వెనుకకు నెట్టి, ఏ అభివృద్ధీ వ్యక్తిత్వమూ లేకుండా చేస్తారు.

వృత్తి స్వాతంత్ర్యం లేక పోబట్టి స్త్రీ వంటింటిని, భర్తను ఇష్టమున్నా లేక పోయినా, వదలి పెట్ట లేని స్థితిలో ఉంది. భర్త ఎన్ని అవమానాల పాలు చేసినా భరించవలసి వస్తుంది. ఆమె ఒక్కొక్కప్పుడు ఎంత నీచానికైనా తలఒగ్గి, ప్రమాదవశాత్తూ తనకు భర్త అయిన వాని పాదాల దగ్గర జీవితాన్నంతా ధార పోయవలసివస్తూంది.

స్త్రీ పురుషుడి మీద ఆధారపడి ఉండమే కాని, అవ

* మొదటి వ్యాసము వివాహసమస్యపై 3-11-45 తేదీన వెలువడిన ఆంధ్ర మహిళలో ప్రచురింపబడినది.

కాశాలున్నా కూడా స్వయం సంపాదనకు పోకుండా, గృహిణీత్వము పొగడ బడుతూ ఉంటుంది. స్త్రీ కుటుంబ నిర్వహణకే ప్రకృతి సిద్ధంగా తయారు చేయబడిందనీ, స్వయ సంపాదన చేసి కొనుట ఒక హేయమైన పని అని ఒక అభిప్రాయం ఎక్కువగా ప్రచారంలో ఉంది. స్వయం సంపాదనకు కొద్దిగా అవకాశాలున్నా కొంత మంది స్త్రీలు వాటిని ఉపయోగించుకో కుండా, ప్రజాభిప్రాయానికి భయపడి, ఆ అవకాశాలను త్రోసివేసి, భర్త మీద ఆధారపడి ఉండడానికే తయారౌతారు.

స్త్రీ ఆర్థిక సంపాదనకు పనికి రాదన్న అభిప్రాయం నిర్హేతుకం. స్త్రీలు తగిన అవకాశాలున్నప్పుడు వేరువేరు ఉద్యోగాలలో పురుషులతో సమానంగా పని చేయగలుగు తున్నారు. వారు అలాగ ఆర్జించగలరు. స్త్రీలు చాలా ఉద్యోగాలకు పనికి రాదన్నది కూడా అబద్ధం. రష్యాలో స్త్రీలకు పురుషులతో పాటు వృత్తిని నిర్ణయించు కొనే అధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నాయి. అక్కడ స్త్రీలు అనేక మంది తమ డబ్బు తాము గణించుకొంటూ, భర్త దగ్గర గౌరవానికి పాత్రులవుతూ, వ్యక్తిత్వంగల వారుగా తయారవు తున్నారు. రష్యా డాక్టర్ల సంఖ్యలో నూటికి 51 వంతు దాకా స్త్రీలే. ఉపాధ్యాయులలో నూటికి 69 వంతులు స్త్రీలే. శాస్త్ర పరిశోధనలు చేస్తున్న వారిలో నూటికి 40 మంది స్త్రీలు. అంతే గాక అనేక మంది స్త్రీలు ఇంజనీర్లుగాను, ట్రాక్టరు డ్రైవర్లు గాను, మిల్లు మేనేజర్లుగాను, సాముదాయక ఫారము మేనేజర్లు గాను పని చేస్తున్నారు. స్త్రీ ఈ రంగంలోని పని చేయ డానికి తగదు అని చూపెట్ట డానికి వీలులేకుండా అన్ని రంగాల్లోను చేరి, స్త్రీ శక్తిని చూపెట్టారు. 5 లక్షల మందికి పైగా స్త్రీలు వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారు. అలా స్వయం సంపాదనను చేసి కొంటున్న స్త్రీలంతా వివాహాలు చేసికొని ఇతర స్త్రీలవలెనే సుఖంగా కాపురాలుంటున్నారు. వారి భార్యాత్వము వలన ఉద్యోగానికి గాని, ఉద్యోగము వలన భార్యాత్వమునకు గాని ఏమీ ఆటంకా లగపడడంలేదు.

స్త్రీకి ఆత్మగౌరవం, వ్యక్తిత్వం ఆర్థిక స్వాతంత్ర్యం తోనే వస్తాయి. తన కాళ్ల మీద తను నిలబడ లేని స్త్రీ మీద పురుషుడికి గౌరవ ముండదు. మొదటిలో ప్రేమ ఒలక బోసినా, రాను రాను 'నా మాట ఎవరి కోసం వింటావు' అనే దృక్పథంలోకి వచ్చి, స్త్రీని నీచంగా చూస్తాడు. స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం కలిగి ఉన్నప్పుడే సంఘంలో ఆమెకు గౌరవం కలుగుతుంది. అప్పుడే ఆమె సక్రమ స్థానాన్ని అలంకరిస్తుంది. కనుక మన దేశంలో వారసత్వపుటాస్తిలో స్త్రీకి జరుగు తున్న అన్యాయం వెంటనే అరికట్ట బడాలి. తండ్రి ఆస్తి పురుషునితో పాటు స్త్రీకి సమానంగా పంచిపెట్ట బడాలి. స్త్రీ స్థానం వంటిల్లే కాదు, ఆమె అన్ని వృత్తుల్లోను ప్రవేశించడానికి హక్కు కలిగి ఉందని గుర్తింప బడాలి. స్త్రీకి పురుషునితో పాటు ఏ ఉద్యోగం చెయ్యడానికైనా హక్కు ఉండాలి. చాల దేశాలలో కొన్ని ఉద్యోగాలను స్త్రీలకు తెరిచినా, కొన్నింటిలో స్త్రీలను బహిష్కరించడ ముంది. మన దేశంలో సివిల్ సర్వీస్‌లో స్త్రీలను తీసికో కూడదని బహిష్కారముంది. ఏ శాఖలో ప్రవేశించ డానికైన స్త్రీకి హక్కుండాలి. చాల మంది స్త్రీలు డాక్టరు, మేస్టరు వంటి ఉద్యోగాలకే ఇష్టపడినా, ఒక స్త్రీ ఇంజనీరుగానో, టెక్నీషియనుగానో ఉండాలని కోరినపుడు ఆమె మీద బహిష్కార ముండకూడదు.

అదిగాక స్త్రీ పురుషు లిరువురూ ఒకే వృత్తిలో పని చేస్తున్నప్పుడు చాల దేశాలలో స్త్రీల జీతం పురుషుల జీతం కంటె తక్కువ ఉంటుంది. మన దేశంలో కార్మికుని కూలి కార్మిక స్త్రీ కూలికి మూడు రెట్లుంటుంది. యుద్ధ కాలంలో ఇంగ్లాండులో ఉపాధ్యాయినుల జీతాలను ఉపాధ్యాయుల జీతాలతో సమానం చెయ్యలన్న తీర్మానం గతి ఏమయిందో అందరికీ తెలిసిందే. ఇటువంటి అన్యాయం తొలగి, పురుషులకి స్త్రీలకి ఒకే వృత్తిలో సమాన జీతాలుండాలి.

ఇలాగ స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం కలిగి, స్వయం సంపాదన చేస్తున్నప్పుడే, ఆమె ఆత్మ గౌరవంకల వ్యక్తిగా తయారవు తుంది. అప్పుడే ఆమె తన హక్కును, సమానతను స్థాపించుకో గలదు.

★

రూపవాణి

'రూపవాణి' దీపావళి సంచిక చాల వ్యాసములు, కథలు, పద్యాలుగలిగి పుష్టిగా వున్నది. వివిధదేశ తారల వర్ణచిత్రములు చాల వున్నవి. నాట్యకళ, ఫిల్ము నిర్మాణములను గురించిన వ్యాసములు కళాభివృద్ధి సూచకముగాను, చదువరులకు వుపయోగకరముగాను వున్నవి. ఇంకొంచము ప్రయత్నించినట్లయితే "హిందీ తారల రహస్యాలు"లోని అమూల్య ఆశయము సరిగా స్పష్టమయి వుండేది.

ఇతర రచనలలో "ఎటామిక్ బాంబు" పేరొక్కన తగినది. ఇప్పటికి ఆ విషయముపై వెలువడిన వ్యాసముల కన్న యిది చాల విశదముగా వున్నది. 'అసాధారణ సమావేశము' నేటి ఆంధ్రుల సభా నిర్వాహణాన్ని బాగా చాటుతున్నది. 'మాతృశ్రీ' 'తండ్రి', 23వ రాసురోడ్డు, మొదలైన కథలు భావపూర్ణముగా బాగున్నవి. నూతన పద్ధతిని వ్రాసిన 'చైతన్య ప్రవాహం' నిదానించి చదివిన మీదట తేటతెల్లముగా వుండి కల్పనా సామర్థ్యమును రూఢిచేస్తున్నది. ఈ విధముగా రచనలు చాల భాగము బాగానేవున్నవి. పత్రిక ముఖచిత్రము ఫిల్ము ప్రకటనగాక పత్రికకు సంబంధించిన ప్రత్యేక విషయమైతే యింకా యెంతో శోభస్కరముగా వుండేడిది.

అ. గిరిజ.

★

ఇండియానా

దౌర్భాగ్యం మాత్రం ఫలిస్తున్న నేటి ప్రతికా రచనకు కృతిగా ఇండియానా వార్షిక సంచికను సంపాదకులు కె. ఆర్. రావుగారు ఆంధ్ర లోకానికి సమర్పించారు. స్వాతంత్ర్య మీకు నర్వోపిస్తున్న బాపూజీ, ఆయన అనుచరులు ముఖ చిత్రంలో కలిసి సంచికకు రమణీయతతో బాటు పూజ్య భావం కలుగ చేసారు. రెండు, మూడు, నాలుగు పేజీల్లో అనుమానిత తప్పింది, వ్యాపార దృష్టి వదలింది ఖాళీగా వుంచడంవల్ల యిండియానాకు వింతశోభ వచ్చింది. డెమీ క్వార్టో 112 పేజీలలో 25 మాత్రము ఎడ్వర్టైజుమెంట్లకు, యింకో 25 బొమ్మలకూ పోను మిగత 60 పేజీలూ మనసు నిండే రచనలకు వినియోగింపబడ్డాయి. ఈశ్వరన్ గారి 'టాయ్ లెట్' కథ సరికొత్త పోకడలో రచింపబడింది. ఎ. యస్. పి. అయ్యర్‌గారి 'వైర్ వాకర్' అభినవ ప్రేమికులకు దారిచూపెట్టింది. కోటంరాజు రామారావుగారి నాటిక 'డాక్టర్స్ డైలమా' నేటి రాజకీయ వాతావరణాన్ని చక్కగా చిత్రించింది. రావుగారి 'కోకోనట్ వుమన్' పద్యం సింపిల్‌గా వుంది; రైమకు తాప [illegible] సుమారు పది వరకూ 'క్రొవాద్యాయుడు' అయినా వ్యాసాలు రాసున్నాయి కాబట్టి భగవాలేదు. కాని సంవత్సరానికొక మారు ప్రచురింపబడే పత్రిక కాబట్టి సంపాదకులు శ్రమ పడితే 'ఒరిజినల్ కంట్రిబ్యూషన్స్' ఎక్కువగా వుండేవి. మొత్తంమీద యిండియానా యింగ్లీషు వచ్చిన వారందరూ శక్తి కార్యాలయం, రాయపేటకు వ్రాసి తెప్పించుకో దగ్గ పుస్తకం. వెల రు. 2-8-0 —క. వ.

నృత్య వేదిక - నృత్య ప్రారంభము

— శ్రీమతి సామ్రాజ్యం —

నృత్యవేదికను గురించి చెప్పబోయే ముందు నృత్యమును గురించి కొంచెం చెప్పడం అవసరం. ఈ నృత్యం చాలా పురాతనమైనది. పురాణకాలంనుంచి కూడా ఇది ఆచరణలో నున్నట్లు తెలుస్తూంది. ఇంద్రుని ప్రార్థన విని బ్రహ్మ దేవుడు చతుర్వేదములనుంచి సారమును గ్రహించి నాట్య వేదమనే పంచమ వేదాన్ని సృష్టించాడు. ఈ నాట్య వేదాన్ని ప్రచారం చేయుటకు భరతమునిని నియోగించాడు. భరతముని ప్రచారం చేయడం చేతనే దీనికి భరతనాట్య మనే పేరు వచ్చింది. భరతముని ఈ నాట్యాన్ని తన నూర్గురు కొడుకులకు ఇతర శిష్యులకు బోధించి ఎక్కువ ప్రచారం చేశాడు. నృత్యము స్త్రీలకే ఎక్కువ ఉపయుక్త మయినదని స్త్రీలలోనే ఎక్కువ రాణిస్తుందని నృత్య ప్రచారం కోసం బ్రహ్మ అప్సర స్త్రీలయిన రంభ, ఊర్వసి, మేనక, తిలోత్తమలను సృష్టించాడు. వారి దగ్గర నుంచే మానవులకు ఈ నృత్య విద్యలభించింది. కొన్ని ముఖ్య సూత్రాలను ఏర్పరచి నాట్య శాస్త్రమనే గ్రంథాన్ని భరత ముని రచించాడు.

ఈ నాట్య శాస్త్రమే నృత్యానికి మూలాధారం. ఈ నాట్య శాస్త్రముపైని అభినవ గుప్తాచార్యుడు విపులమైన వ్యాఖ్యానము వ్రాశాడు. గుప్తాచార్యుడు కాశ్మీరదేశపు బ్రాహ్మణుడు. ఇతడు 11 వ శతాబ్దమువాడు. దీనిని బట్టి ఈ నృత్య శాస్త్రము హిందూదేశములో 11వ శతాబ్దము నుంచి ప్రచారములో నున్నట్లు తెలుస్తూంది.

నృత్య ప్రదర్శనము వేదాధ్యయన సమయములోను భగవంతుని పూజించు సమయములలో వివాహములు మొదలయిన శుభసమయములలో చేయుదురు. నృత్యము, నాట్యము, నృత్తము, నృత్యము, అని మూడు విధములు. నాట్యమనగా నాటకములలో ఉపయోగించునది. నృత్త మనగా కేవలము తాళలయానుగుణ్యముగా కాళ్లతో అడుగులు వేయునది. నృత్యమనగా భావరాగ తాళయుక్తమైనది. యిప్పుడు నే చెప్పబోయేది నృత్యాన్ని గురించే. ఈ నృత్య మభ్యసించి ప్రదర్శించు నర్తకీ నర్తకులకు ఏ యే లక్షణములు ఉండవలెనో అవి నాట్య శాస్త్రములో వర్ణింపబడి ఉన్నాయి.

అంతే కాకుండా ప్రేక్షకులకు ఉండవలసిన లక్షణాలను కూడా నాట్య శాస్త్రములో వర్ణించారు.

నృత్యాన్ని ప్రదర్శించడానికి ఒక ప్రదర్శన స్థల ముండాలి కదా? దీనినే "నృత్యవేదిక" అంటారు. ఈ వేదిక విశాలంగా ఉండి ఆరోగ్యపరి సరములలో ప్రేక్షకు లకు, నర్తకీ నర్తకులకు అనుకూలముగా ఉండాలి. నృత్య వేదిక కట్టబడే ప్రదేశాన్ని బహుజాగ్రత్తగా పరిశీలించి భూమిని బాగుగా దున్ని గట్టి ఇటుకలలో దృఢంగా నిర్మించాలి. నృత్యవేదిక మూడు విధములు. ఒకటి చతు రశ్రము అనగా నాలుగు ప్రక్కల కొలతలు సమముగా కలది. రెండు, త్రికోణ ఆకారము కలది. మూడు, పొడువు ఎక్కువ వెడల్పు తక్కువ కలది. ఈ మూడవ పద్ధతి వేదికను రెండు సమభాగములు చేసి వెనుక భాగమును రంగులు వేసుకొనుటకు దుస్తులు భూషణములు ధరించుటకు మార్చుకొనుటకు ఉపయోగిస్తారు. ముందు భాగమునకు వెనుక భాగమునకు మధ్యగా గోడలు పెట్టుటకాని తెరలు కట్టుటకానీ చేయుదురు. నృత్యవేదికపై ప్రవేశించుటకు ఈ గోడలకు కానీ తెరలకు కానీ ద్వారములుంటాయి.

ఈ ముందుభాగాన్నే నృత్యవేదిక అని కాని రంగస్థల మని కాని అంటారు. ఈ వేదికపైననే వెనుక ప్రక్క ఒక పీఠము వేసి దానిపై దేవతా విగ్రహాలనుంచుతారు. నాట్య శాస్త్రము ప్రకారం ఈ నృత్యవేదిక కొలతలుకూడా నిర్ణయింపబడి ఉన్నాయి. మధ్యమ తరగతి నృత్యవేదిక యొక్క కొలతలు సుమారు 40 గజముల పొడవు 20 గజముల వెడల్పు కలిగి ఉండాలి. నృత్యప్రదర్శనము చేయబడే ఈ నృత్యవేదిక యొక్క మూడు ప్రక్కలగల గోడలకు కాని తెరలకుకాని రంగురంగులతో తోరణములు అనేక విధములయిన అలంకారములు చేయుదురు. వాటిపై స్త్రీ పురుషుల నాట్యభంగిమములతో చిత్తరవులు కూడా చిత్రిస్తారు. వేదికపై రంగు రంగులతో చిత్రవిచిత్రమైన ముగ్గులనుకూడా

పెడతారు. శృతివంత పాటకులు ప్రక్క-వాయిద్యములయిన వేణువు మృదంగము మొదలయిన వాద్యగాండ్రు కూడా రంగస్థలముపైననే నర్తకుల వెనుక ప్రక్క-నిలబడి ఉంటారు.

దేశకాల పరిస్థితుల ననుసరించి ప్రజాభిరుచినిబట్టి నాట్య పద్ధతులు మారుననీ నాట్య శాస్త్రప్రవీణులు నాట్యపద్ధతులను మార్చవచ్చునని కూడా భరతముని నాట్యశాస్త్రములో వ్రాశాడు.

అప్పటి ప్రదర్శనాలు రాత్రి తెల్లవారే వరకు ఒకే ఒక కథను విసుగెత్తించేటట్లు ఒకే ఒక పాత్ర గంటలతరబడి వేదికపై నుండి నృత్యగానములు చేస్తూండేవి. కాబట్టి ప్రేక్షకుల దృష్టిని పాత్రలపై నుండి ఆకర్షించేందుకు చిత్తరువులు అలంకారములు ఉండేవి. పాటకులు ప్రక్క-వాయిద్య గాండ్రు హాస్యగాండ్రు కూడా అవసరమయేది. కాని నేటి ప్రజాభిరుచి ననుసరించి నేటి ప్రదర్శన కాలము బట్టి వేదికపై ప్రదర్శనములో పాల్గొనె నర్తకీ నర్తకులు తప్ప వేరేమీ లేకుండా ప్రేక్షకుల దృష్టిని నర్తకీనర్తకులపైనే కేంద్రీకరించేటట్లుంటే బాగుంటుందని తోస్తుంది.

నృత్యమును ప్రారంభించబోయే ముందు ఇష్టదేవతా ప్రార్థనము తరువాత నృత్యవేదికకు అనగా రంగస్థలమునకు పూజ చేస్తారు. ఇది చాలాముఖ్యము. నృత్యములో అనేక పద్ధతులున్నాయి. ప్రస్తుతము ఎక్కువ ప్రచారములో నున్నవి దక్షిణ హిందూదేశపు భరతనాట్యము మలబారు దేశపు కథకళీ ఉత్తరహిందూస్థానపు కథల్, అస్సాందేశపు మణిపురీ. ఈ సాంప్రదాయములు ఆయాదేశములలో వేరు వేరు పేరులతో అభివృద్ధి చెందినప్పటికి వీటి అన్నిటి యొక్క మూలము నాట్యశాస్త్రమే. ఈ నాలుగు నాట్య పద్ధతులలో శాస్త్రసమ్మతమైనవి. సంపూర్ణమైనవి భావ రాగతాళయుక్తమయినవి కథకళీ భరతనాట్యములే. కథల్ నాట్యము ఇంగ్లీషువారి టాప్‌డాన్సువలె కేవలం నృత్త ప్రధానమైనది.

మణిపురీ నాట్యము అందమయిన దేహావయముల కదలికయే ప్రధానముగా కలది.

భరతనాట్యము అలరిప్పూ అనే నృత్తములో ప్రారంభిస్తారు ఈ అలరిప్పూ దేహములోని ముఖ్యాంగము లన్నిటికి పరిశ్రమ కల్గించుతుంది. దీని వలన శరీరమునకు వేడి ఎక్కి-ముందు చేయబోయె నృత్యములకు దేహమును అనుకూలముగా చేస్తుంది. భరతనాట్యములో నృత్యప్రారంభమునకు పతాకహస్తాన్ని ఉపయోగించాలి. ఈ నాట్యము స్త్రీలకు ఎక్కువ ఉపయుక్తమయినది.

ఇష్టదేవతా ప్రార్థనము రంగపూజ అయిన తరువాత కథకళీ నృత్యము కూడా తోలియం అనే ఒక విధమైన నృత్తములోనె ప్రారంభిస్తారు. భరతనాట్యములో వలె కాకుండా చిన్న తెర వెనుక చెయ్యడం చేత నర్తకుల శరీరానికి వేడి ఎక్కించి దేహమును ముందు చేయబోయె నృత్యములకు అనుకూలముగా చేయడమే కాకుండా నర్తకుల పిరికి తనమును భయమును పోగొట్టి వేస్తుంది. ఈ నృత్తమయిన తరువాత కథకళీలో "పొరప్పాడు" అనే నృత్యాన్ని తెర తీసివేసి చేస్తారు. పొరప్పాడు అంటే మళయాళ భాషలో ప్రారంభము అని అర్థము. ఈ కథకళీ నృత్యము పురుషుల కెక్కువ అనుకూలమయిన నృత్యము.

★ (సశేషము)

★